ఆదివారం
14-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 203
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తైవాన్‌లో లై చింగ్-టే విజయం

తైపే: తైవాన్ అధ్యక్ష ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థి లై చింగ్-టే విజేతగా నిలిచారు. డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ)కి చెందిన లైచింగ్-టే వరుసగా మూడవసారి గెలిచారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనకు 40.2శాతం ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, ప్రధాన ప్రతిపక్షమైన కౌమిన్‌టాంగ్ పార్టీ (కేఎంటీ) అభ్యర్థి హౌ యు-ఈని ఓడించగలిగారు. కేఎంటీ అభ్యర్థికి 33.4శాతం ఓట్లు వచ్చాయి. 'హౌ యు-ఈ తన ఓటమిని అంగీకరిస్తూ, దేశ ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తాం' అని అన్నారు. లై చింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికలను బీజింగ్, వాషింగ్టన్ నిశితంగా గమనించాయి. అయితే లై చింగ్‌ను శాంతికి ముప్పుగా, ప్రమాదకరమైన వేర్పాటువాదిగా చైనా అభివర్ణించడం తెలిసిందే.

ఖర్గేకు ఇండియా పగ్గాలు

- కుదిరిన ఏకాభిప్రాయం
- సీట్ల సర్దుబాటుపై కొలిక్కిరాని చర్చలు
- ఐక్యంగా ముందుకెళ్లాలని నిర్ణయం
- భేటీకి మమత, అఖిలేశ్, ఉద్ధవ్ గైర్హాజరు

న్యూఢిల్లీ:
లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ...ఇండియా కూటమి చైర్‌పర్సన్ ఎవరన్న చర్చకు తెరపడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పగ్గాలు అప్పగించాలని కూటమి నిర్ణయించింది. ఏప్రిల్-మేలో ఎన్నికలు జరగనున్నందున...కన్వీనర్ నియామకం, సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కూటమి భావించింది. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇదే క్రమంలో కూటమి పార్టీలు శనివారం వర్చువల్‌గా భేటీ అయి చైర్‌పర్సన్‌గా ఎవరుండాలనే అంశంపై చర్చోపచర్చలు జరిపి ఖర్గే పేరును తీర్మానించాయి. ఇప్పటివరకు బీహార్ సీఎం, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ పోటీదారుడిగా ఉన్నారు. తనకు ఈ పదవి వద్దని, కాంగ్రెస్ నుంచే ఎవరైనా ఉంటే బాగుంటుందని ఆయన చెప్పారు. దీంతో ఖర్గే నియామకానికి మార్గం సుగమమైంది. సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) నాయకులు మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, ఉద్ధవ్ ఠాక్రే మినహా అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు. ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ ఇంట్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆప్, కాంగ్రెస్ మధ్య రాజీ కుదరడంతో కేజ్రీవాల్ వచ్చారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న విభేదాలు మరిచి జాతీయ స్థాయిలో ఉమ్మడిగా ముందుకెళితేనే విజయం సాధించగలమని నాయకులు నొక్కిచెప్పారు. కూటమిని మరింత బలపర్చడం, భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు, భారత్ జోడో న్యాయ యాత్రపై ప్రధానంగా చర్చించారు. సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. విపక్షాల తరపు ప్రధాని అభ్యర్థి కూడా ఖర్గేనే కావచ్చని తెలుస్తోంది. ప్రధాని అభ్యర్థిగా

- మిగతా 2 లో

సీట్ల సర్దుబాటు కసరత్తు

- చంద్రబాబు-పవన్ కీలక భేటీ
- ఉమ్మడి మేనిఫెస్టో అంశాలపై చర్చ
- రెండు పార్టీల అభ్యర్థులతో తొలి జాబితా విడుదలకు నిర్ణయం
- నేడు మందడంలో భోగి మంటల్లో ప్రజావ్యతిరేక జీవోలు దహనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి శనివారం రాత్రి 7 గంటల తర్వాత పవన్ చేరుకున్నారు. ఆయన వెంట జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా వచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చంద్రబాబు ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్‌ను భోజనానికి ఇంటికి రావల్సిందిగా ఆహ్వానించారు. పవన్, మనోహర్‌కు చంద్రబాబు, లోకేశ్ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం వివిధ అంశాలపై వారిద్దరూ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో లోకేశ్‌తో పాటు నాదెండ్ల మనోహర్, రెండు పార్టీలకు చెందిన కీలక నేతలు కూడా పాల్గొన్నారు. ఈ భేటీలో ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్న టీడీపీ, జనసేన పార్టీల తరపున సీట్ల సర్దుబాటు అంశంతో పాటు ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన తదితర విషయాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అలాగే బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా రాజకీయంగా కలిగే లాభనష్టాలపై కూడా చర్చించినట్లు సమాచారం. జనసేన-టీడీపీ సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వస్తున్న వలసలు చర్చకొచ్చాయి. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాతే పార్టీలోకి ఆహ్వానించాలని బాబు, పవన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నాలుగున్నరేళ్లుగా ప్రజల్లో వ్యతిరేకత, అవకాశవాదం కోసం వచ్చే నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలోకి తీసుకోవద్దని, కూటమి తొలి జాబితా సిద్ధం చేసిన అనంతరం ఉమ్మడిగా కలిసి జాబితాను విడుదల చేయాలని బాబు, పవన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తొలి జాబితాలో టీడీపీ-జనసేన నుంచి ఎవరెవరు పేర్లు ప్రకటించాలన్న దానిపై కూడా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఓ అవగాహన కొచ్చినట్లు పార్టీ నేతలు

- మిగతా 2 లో

జగన్ పాలనలో వలసలు

- ఇక మూడు నెలలే ఛాన్స్
- అంగన్‌వాడీలను బెదిరిస్తే ఊరుకోం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:
సీఎం జగన్ ఉద్యోగం కేవలం మూడు నెలలు మాత్రమేనని, ప్రజలే ఆయన ఉద్యోగం ఊడగొడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలో 460 మండలాలు కరువుతో అల్లాడిపోతుంటే కేవలం 110 మండలాల్లో మాత్రమే కరువు ఉందని సీఎం జగన్ వెల్లడించడం ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్‌లో శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ లక్షల కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు గుప్పించడం తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని రామకృష్ణ విమర్శించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కరువు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ప్రజలు గ్రామాలకు గ్రామాలు కర్నాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంతటి దారుణ పరిస్థితులు ఉంటే...సంక్రాంతి పండుగ బాగా జరుగుతోందని, వలసలు ఏవీ లేవని సీఎం జగన్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో డిజిటల్ లైబ్రరీ ఏ జిల్లాలో ఉందో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. నాడు నేడులో భాగంగా కొన్ని స్కూళ్లకు రంగులు వేయించడం నిజమే

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు

- మూడు నెలల్లో ఇది నాల్గోసారి
- 18న విచారణకు రావాలని ఢిల్లీ సీఎంకు ఆదేశాలు

2 లో

ఇదీ లోకం!

ఒరేయ్, మన పాత పార్టీ కండువాలు, మానిఫెస్టోలు, హామీలు పత్రా ఇందులో తగలెడదాం!

వైసీపీకి మరో షాక్

- ఎంపీ బాలశౌరి రాజీనామా
- ఒంగోలులో సీట్ల పంచాయితీ
- ఎంపీ మాగుంట, బాలినేని అసంతృప్తి
- రాజీనామాకు బొప్పన భవ కుమార్ సిద్ధం
- ఇన్‌ఛార్జ్‌ల మార్పుతో ఎదురు దెబ్బ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వైసీపీకి షాక్‌లపర్వం కొనసాగుతోంది. తాజాగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆ పార్టీకి రాజీనామా చేశారు. సీఎం జగన్‌కు ఎంతో సన్నిహితంగా ఉన్న బాలశౌరి రాజీనామాపై పార్టీ శ్రేణులు ఆందోళన చెందారు. జగన్ టికెట్ల మార్పులు, చేర్పులు చేపట్టినప్పటి నుంచి ఆ పార్టీలో అసంతృప్తులు, నిరసనలు, రాజీనామాలు పెరుగుతున్నాయి. తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని బాలశౌరి అసంతృప్తిగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చేందుకు అధిష్టానం నిరాకరించింది. దీంతో ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేతకు పంపారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలోనే ప్రకటించనున్నారు. వైసీపీ విడుదల చేసిన రెండు, మూడు విడతల జాబితాల్లో బాలశౌరి పేరు లేదు. కొంతకాలంగా మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో బాలశౌరికి మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. దీంతో బలమైన అభ్యర్థిని ఆ స్థానంలో నిలబెట్టాలని మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు భావించారు. ఇందుకోసం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ రాజీనామా చేశారు. తనను కాదని మంత్రి జయరామ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వడంపై ఆయన కలత చెందారు. 25 ఎంపీ స్థానాలకుగాను ముగ్గురు సిట్టింగ్‌లకు మాత్రమే తిరిగి టికెట్లు కేటాయించనున్నారు. మిగిలిన 22 మందిని మార్చాలని సీఎం నిర్ణయించారు.గెలుపు గుర్రాలు, సామాజిక కోణంలో ఉన్న వారికే టికెట్లు కేటాయిస్తున్నారు. బాలశౌరికి టికెట్ ఇవ్వడం లేదని

- మిగతా 2 లో

మారణహోమం ఆపండి

- పలస్తీనాకు ప్రపంచ దేశాల సంఘీభావం
- అంతర్జాతీయంగా 100 నగరాల్లో 'గ్లోబల్ ర్యాలీ'
- గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణకు 100 రోజులు

2 లో

నేటి నుంచి రాహుల్ యాత్ర

ఇంఫాల్:
రాహుల్ గాంధీ నేతృత్వంలో 'భారత్ జోడో న్యాయ యాత్ర' ఆదివారం మణిపూర్ నుంచి ప్రారంభం కానున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేపట్టిన ఈ యాత్ర నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక న్యాయం వంటి సమస్యలను ఎత్తిచూపుతుంది. భారత్ జోడో న్యాయ్ యాత్ర 15 రాష్ట్రాల్లోని 100 లోక్‌సభ నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. ఇది రాహుల్‌గాంధీ అంతకుముందు

- మిగతా 2 లో

అసంతృప్తులకు వల

- పోటీకి సిద్ధమవుతున్న టీడీపీ
- వైసీపీకి రాజ్యసభ గండం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో చావుదెబ్బతిన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ రాజ్యసభ గండం పొంచి ఉంది. రాష్ట్రం నుంచి ప్రస్తుతం రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైసీపీకి చెందిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రకుమార్, బీజేపీకి చెందిన సీఎం రమేశ్ పదవీకాలం పూర్తి కానుంది. ఏప్రిల్ లోపు ఈ మూడు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలి. ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం మూడు స్థానాలూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెల్చుకోవడానికి అవకాశం ఉంది. టీడీపీకి గెలవడానికి అవసరమైన సంఖ్యాబలం లేదు. అయినప్పటికీ గతేడాది ముగ్గురు వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతుతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ అనూహ్య విజయం సాధించారు. మరలా అదే పరిస్థితి రాజ్యసభ ఎన్నికల్లోనూ ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వీరిలో ముగ్గురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించగా, ఆ పార్టీకి చెందిన ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీకి మద్దతు ఇస్తున్నారు. అయినప్పటికీ టీడీపీ సంఖ్య 23 దాటకపోవడంతో రాజ్యసభ సీటు గెలవడానికి ఇది సరిపోదు. కానీ

- మిగతా 2 లో

రణ (ఎర్ర) సముద్రం

హౌతీల కేంద్రాలపై అమెరికా, బ్రిటన్ వైమానిక దాడులు

వాషింగ్టన్/సనా/ఏథెన్స్: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ కొనసాగిస్తోంది. దీనికి నిరసనగా ఎర్ర సముద్రం రణ రంగంగా మారుతోంది. రవాణా నౌకలే లక్ష్యంగా ఇరాన్ మద్దతుగల హౌతీలు దాడులకు ప్రతీకారంగా అమెరికా, బ్రిటన్ సంయుక్తంగా క్షిపణులతో విరుచుకుపడుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం కూడా యమెన్‌లోని హౌతీల కేంద్రంపై దాడులు జరిగాయి. యెమన్ రాజధాని సనాలో భారీ పేలుడు సంభవించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లోని యెమన్ తీర ప్రాంతాల వైపు రావొద్దని అమెరికా జెండాలతో ఉన్న వాణిజ్య నౌకలను అమెరికా నేవీ హెచ్చరించింది. మరో 72 గంటల పాటు ఆ మార్గంలో వెళ్లొద్దని సూచించింది. ఈలోగా యెమన్‌లోని హౌతీ కేంద్రంపై క్షిపణితో దాడి చేసింది. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిసూ హౌతీలు మరిన్ని దాడులు ఎదుర్కోక తప్పబోదన్నారు. అయితే అమెరికా-బ్రిటన్ తీరుకు నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

సనాలో భారీ ప్రదర్శనలు

అమెరికా, బ్రిటన్ సంయుక్తంగా వైమానిక దాడులు జరపడానికి యెమన్ రాజధాని సనాలో హౌతీ మద్దతుదారులు భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది వీధుల్లోకి వచ్చి మద్దతు తెలిపారు. యెమన్ నగరాల్లోని ఆయుధగారాలు, 60కుపైగా శిక్షణ స్థలాలపై బాంబులతో దాడులకు పాల్పడిన అమెరికా-బ్రిటన్ తీరును ఖండించారు. వీటిని తిప్పికొట్టాలని హౌతీలకు పిలుపునిచ్చారు.

ప్రాదేశిక యుద్ధం రావచ్చు: గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ హెచ్చరిక

యెమన్‌లో హౌతీలకు వ్యతిరేకంగా అమెరికా, బ్రిటన్ వైమానిక దాడులు జరిపించడాన్ని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇది ప్రాంతీయ యుద్ధానికి దారి తీయెచ్చు అని హెచ్చరించింది. అమెరికా, బ్రిటన్ క్షిపణులతో యెమన్‌పై భీకర దాడులు చేస్తున్నాయి. ఇరాన్ వంటి మరిన్ని శక్తులు రంగంలోకి దిగితే యుద్ధం జరిగే ప్రమాదం ఏర్పడుతుందని కేకేఈ ప్రకటన పేర్కొంది. అమెరికా-నాటో దళాల లక్ష్యం... హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నుంచి నౌకలకు రక్షణ కల్పించడం కాదని, కీలక క్షేత్రంపై వ్యూహాత్మకంగా తమ నియంత్రణను ప్రకటించుకోవడమని కేకేఈ వ్యాఖ్యానించింది. ఎర్ర సముద్రంలో 'వెల్ఫేర్ గార్డ్'లో భాగంగా గ్రీక్ యుద్ధ నౌకను పంపాలన్న నిర్ణయాన్ని ఆక్షేపించింది. తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని గ్రీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సామ్రాజ్యవాదులకు మద్దతివ్వద్దని సూచించింది. పలస్తీనియన్ల మారణహోమాన్ని, పలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ దురాక్రమణను తక్షణమే నిలిపివేయాలని పిలుపునిచ్చింది. పశ్చిమాసియాలో విధ్వంసకర పరిస్థితులను మరింత తీవ్రరూపం దాల్చకుండా నివారించేందుకు తమ వంతు కృషి చేయాలని గ్రీస్ ప్రభుత్వాన్ని కమ్యూనిస్టు పార్టీ కోరింది.

జో బైడెన్‌కు నిరసన సెగ



అమెరికా: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రజల నుండి నిరసన సెగ తగిలింది. 'విధ్వంసకర జో' కు ఓటు వేయబోమని నినాదాలతో హోరెత్తించారు. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. 2024లో జో బైడెన్ చేపట్టిన మొదటి ప్రచారంలోనే ఇలా నిరసన ఎదురైంది. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పెన్సిల్వేనియాలో జో బైడెన్ పర్యటించారు. ఇజ్రాయిల్‌కు బైడెన్ మద్దతు ఇవ్వటంపై ఆగ్రహంతో ఉన్న అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున గుమిగూడిన ప్రజలు 'విధ్వంసకర జో'కు తాము ఓటు వేయబోమని నినాదాలు చేశారు. జో బైడెన్ 'ఓడిపోయిన వ్యక్తి' అని, అతను ఇక ఇంటికి వెళ్లిపోవాల్సిందేనని ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గత్యంతరం లేక జో బైడెన్ పెన్సిల్వేనియా నుంచి వెనుదిరిగినట్టు తెలుస్తోంది.మరోవైపు, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఊహించిన దాని కంటే ఎక్కువగా క్షీణిస్తున్నాయి. గత ఎన్నికల సమయంలో 14 మిలియన్ల ఉద్యోగాలు సృష్టిస్తానన్న జో బైడెన్ హామీ ఇంకా నెరవేరలేదు. ఇప్పటికైనా అమెరికా ప్రజలు, కార్మికుల ఖర్చులు తగ్గించాల్సిన అవసరం ఉంది. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో 81 ఏళ్ల జో బైడెన్, ప్రతిపక్ష నేత డొనాల్డ్ ట్రంప్ కంటే తక్కువ అప్రూవల్ రేటింగ్ పొందుతున్నారు. అమెరికాలోని నల్లజాతి, కొన్ని మైనార్టీల ఆదరణను క్రమంగా జో బైడెన్ కోల్పోతున్నట్లు తెలుస్తోంది. 2020లో జో బైడెన్ గెలవడానికి సహకరించిన ఈ వర్గాలు ప్రస్తుతం ఆయన పాలనపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

జగన్ పాలనలో వలసలు

(మొదటిపేజీ తరువాయి)

అయినా...రాష్ట్రవ్యాప్తంగా 6.10 లక్షలమంది విద్యార్థులు ఎందుకు బయటికి వెళ్లిపోయారో సీఎం జగన్ చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం వాస్తవం కాదా అని నిలదీశారు. యూనివర్సిటీల్లో పీజీకి సిబ్బందే లేరని, దీంతో యూనివర్సిటీలు ఖాళీ అవుతున్నాయని విమర్శించారు. విద్యా వ్యవస్థను సీఎం జగన్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. తుపానుతో 11 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రైతులు ఇంతటి విషాదం ఎదుర్కొంటుంటే జగన్ పట్టనట్టుగా వ్యవహరించడం దుర్మార్గమని విరుచుకుపడ్డారు. జగన్ హయాంలో గ్రామీణ వ్యవస్థ చిన్నాభిన్నమైందని, రైతులు అప్పుల్లో కూరుకుపోయారని వివరించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం 1.06 లక్షల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నెల రోజులుగా ధర్నా చేస్తున్నా జగన్‌కు చీమకుట్టినట్లు కూడా లేదని ఘాటుగా విమర్శించారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట తప్పడమే కాకుండా ఎస్మా ప్రయోగించడం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనమని విరుచుకుపడ్డారు. ఉద్యోగాలు ఊడతాయని అంగన్‌వాడీలను బెదిరించడం దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. సంక్రాంతి పండుగ ముగిసేలోపు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వామపక్ష పార్టీలతో పాటు టీడీపీ, కాంగ్రెస్, జనసేన, ఇతర ప్రజా సంఘాలతో కలసి వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఏ ప్రభుత్వమైనా అధికారులను బదిలీ చేసిన దాఖలాలు చూశామని, సీఎం జగన్ మాత్రం తన ఎమ్మెల్యేలు, ఎంపీలను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్‌ను కళ్యాణదుర్గం నుండి పెనుకొండకు బదిలీ చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కర్నూలు జిల్లాలో ఒక నియోజకవర్గంలో ఓడిపోయే నాయకుడిని ఏడు నియోజకవర్గాలకు ఎంపీగా నియమించడం జగన్ తుగ్లక్ ఆలోచనకు నిదర్శనమన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, కేశవ రెడ్డి, నారాయణ స్వామి, రమణ, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి రాహుల్ యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

చేసిన జోడో యాత్రకు కొనసాగింపుగా ఉంటుంది. పార్లమెంటులో ప్రజల సమస్యలు లేవనెత్తడానికి ప్రభుత్వం అవకాశం ఇవ్వనందున భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. రాజ్యాంగంలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ సూత్రాలను పునరుద్ధరింపజేయడానికి చొరవ చూపుతుంది. ఇది ఎన్నికల యాత్ర కాదని కాంగ్రెస్ నొక్కిచెప్పినప్పటికీ, చివరి దఫా అసెంబ్లీ ఎన్నికలలో పేలవమైన ప్రదర్శన తర్వాత పార్టీ తన అదృష్టాన్ని పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. భావోద్వేగ సమస్యలను బీజేపీ రాజకీయంగా దుర్వినియోగం చేస్తున్నదని, వాస్తవ సమస్యల నుంచి దృష్టి మళ్లించి దేశ ప్రజలకు ద్రోహం చేస్తున్నదని రాహుల్‌గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో న్యాయ యాత్రను ఇంఫాల్‌లో ప్రారంభించడానికి బదులుగా తౌబాల్ జిల్లాలోని ఒక ప్రైవేట్ మైదానం నుంచి రాహుల్ ప్రారంభిస్తారు. కాగా, ప్రజల సంఖ్యను పరిమితం చేస్తూ ఇక్కడి ప్యాలెస్ గ్రౌండ్స్ నుంచి యాత్ర ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్‌కు షరతులతో కూడిన ఆమోదం తెలిపింది. అందుకే మరో వేదికను ఎంచుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గత ఏడాది మే నుంచి మణిపూర్ జాతి హింసతో అట్టుడికింది. 180 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పార్టీ అగ్రనేతలందరూ యాత్రను జెండా ఊపి ప్రారంభించనున్నారు. గత 10 ఏళ్లుగా జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పేందుకు భారత్ జోడో న్యాయ్ యాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. 'సాహోమత్, దారో మత్ (బాధపడకండి, భయపడకండి)' అనే ట్యాగ్‌లైన్‌తో 'న్యాయ' గీతాన్ని విడుదల చేసింది.

ఖర్గేకు ఇండియా పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పేరును మమత, కేజ్రీవాల్‌తో పాటు ఇంకొందరు ఇంతకుముందే ప్రతిపాదించారు. కానీ ఖర్గే మాత్రం ఎన్నికల ఫలితాల తర్వాత నిర్ణయం తీసుకుందామని సర్ది చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించడంపై దృష్టి పెట్టాలని, ప్రధాని ఎవరన్నది తర్వాత ప్రకటించవచ్చని సూచించారు.

కూటమిలో విభేదాలు లేవు: పవార్

చైర్‌పర్సన్ నియామకం విషయంలో ఇండియా కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ముందస్తు కార్యక్రమాల కారణంగా కొంతమంది దీనికి రాలేదని పవార్ చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక కూడా చైర్‌పర్సన్‌ను ప్రకటించ వచ్చని, ఇందుకు కంగారేమీ లేదని అన్నారు. నితీశ్ కుమార్ పేరును కొందరు ప్రతిపాదించారు కానీ ఆయన వద్దన్నారన్నారు. పార్టీల అధ్యక్షుల బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. ఓట్ల కోసం ఒకరిని నాయకుడిగా నిలబెట్టాల్సిన అవసరం లేదని పవార్ తెలిపారు. ప్రత్యామ్నాయం కల్పించగలమన్న విశ్వాసం ఉందని చెప్పారు. 1977లోనూ మొరార్జీ దేశాయ్‌ని ప్రతిపక్షాల తరపు ప్రధాని అభ్యర్థిగా ప్రకటించలేదని గుర్తుచేశారు. పార్టీలన్నీ ఏకతాటిపైకి రావడం సానుకూలమన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికపై చర్చించలేదని చెప్పారు. ఎవరెన్ని స్థానాల్లో పోటీ చేస్తారో ఖరారైన తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. రామ మందిరం వివాదంపై మాట్లాడుతూ 'అయోధ్యలో రామ మందిరాన్ని ఎవరూ వ్యతిరేకించలేదని, కానీ నిర్మాణం పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం జరిపించడం వెనుక రాజకీయ ఉద్దేశాన్ని వ్యతిరేకిస్తున్నారని పవార్ అన్నారు.

మారణహోమం ఆపండి

జకార్త/జెరూసలేం: గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ కొనసాగుతోంది. 14 వారాలుగా ఇళ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు, బేకరీలు, ప్రార్థనా స్థలాలు, నీటి వనరులు చివరకు ఐరాస శిబిరాలపైనా ఇజ్రాయిల్ దాడులు చేస్తోంది. హమాస్ అంతమే లక్ష్యమంటూ ఇజ్రాయిల్ దళాలు వైమానిక, భూతల దాడులు కొనసాగిస్తూ మారణహోమం సృష్టిస్తున్నాయి. పోరు మొదలై ఆదివారానికి 100 రోజులవుతాయి. గాజా నివాసానికి అనుకూలంగా లేదని ఐక్యరాజ్య సమితి ఆవేదన వ్యక్తం చేసింది. చిన్నారులు, మహిళలతో సహా ఇప్పటికే 23,708 మంది పలస్తీనియన్లు చనిపోయారు. దీంతో పలస్తీనా ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో సంఘీభావం వ్యక్తమవుతోంది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా ఇప్పటికే అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కాగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పలస్తీనాకు అనుకూలంగా 100 ప్రపంచ నగరాల్లో శనివారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. మారణహోమాన్ని తక్షణమే ఆపాలన్న నినాదం ప్రపంచ వ్యాప్తంగా మారుమోగింది. 'గ్లోబల్ ర్యాలీ' పిలుపునకు స్పందిస్తూ ఇండోనేసియా, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, బ్రిటన్, అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, డెన్మార్క్, నైజీరియా, ఘనా, జపాన్, దక్షిణ కొరియా, స్వీడెన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, జోర్డాన్, టర్కీ దేశాల్లో భారీ ఎత్తున నిరసనలు నిర్వహించారు.

ఇండోనేసియా రాజధాని జకార్తలోని అమెరికా దౌత్యకార్యాలయాన్ని నిరసనకారులు ముట్టడించారు. 'పలస్తీనాకు స్వేచ్ఛ' నినాదాలు చేశారు. మారణహోమాన్ని తక్షణమే ఆపాలని, గాజాలోని ఇండోనేసియా ఆసుపత్రిని ఖాళీ చేయాలని, దానిని సైనిక స్థావరంగా వాడవద్దని ఇజ్రాయిల్‌ను డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచే అమెరికా దౌత్యకార్యాలయం వద్ద జనం గుమ్మిగూడారు. ర్యాలీలో పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు. 'ఏది తప్పు, ఏది ఒప్పు అనేది పిల్లలకు తెలియజేయాలి. తోటి వారికి సహాయ పడాలని నేర్పాలి. అందుకోసమే వారిని వెంట తెచ్చామ'ని చిన్నారులతో పాటు ర్యాలీలో పాల్గొన్న వారన్నారు. 'అమానవీయతపై మానవత్వ పోరు' నినాదాలు దక్షిణాఫ్రికాలో మారుమోగాయి. కాల్పుల విరమణ, దురాక్రమణ నిలిపివేత కోసం ఆఫ్రికా ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. సౌత్ ఆఫ్రికన్ జూస్ ఫర్ ఏ ఫ్రీ పలస్తీన్ (ఎస్ఏజేఎఫ్‌పీ), పలస్తీనియన్ సాలిడరిటీ క్యాంపెయిన్ అధ్వర్యంలో జొహానెస్‌బర్గ్, కేప్‌టౌన్ నగరాల్లో భారీ ప్రదర్శనలు జరిగాయి. ఈక్వల్ ఎడ్యుకేషన్, గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ ఫౌండేషన్ కూడా పాల్గొన్నాయి. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో వేలాది మంది రోడ్లపైకొచ్చి పలస్తీనాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఇప్పటివరకు ఐర్లాండ్‌లో ఇంత భారీ ప్రదర్శన జరగలేదని నిర్వాహకులు తెలిపారు. 70 సంఘాలు కలిసి వచ్చినట్లు వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పర్నాల్ స్క్వేర్‌లో గార్డెన్ ఆఫ్ రిమెంబరెన్స్ వద్దకు నిరసనకారులు చేరుకొన్నారు. అక్కడ నుంచి సెయింట్ స్టీఫెన్స్ గ్రీన్‌లోని విదేశీ వ్యవహారాల శాఖ కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించారు. రిటైర్డ్ బాక్సర్ టైరోన్ మెక్‌కెన్నా, ఐరిస్ కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అధ్యక్షుడు జస్టిస్ మెక్ క్యాంప్‌హిల్, ఐరిష్ అండ్ పలస్తీనా సాలిడరిటీ క్యాంపెయిన్ (ఐపీఎస్‌సీ) చైర్‌పర్సన్ జియో లావ్‌లోర్ పాల్గొన్నారు. ఐపీఎస్‌సీ అధ్వర్యంలోనే గాజాలో మారణహోమం ఆపాలి, కాల్పుల విరమణ కోసం ర్యాలీ జరిగింది. ఇజ్రాయిల్‌పై మరిన్ని ఆంక్షలు విధించాలని ఐర్లాండ్ ప్రభుత్వాన్ని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఐసీటీయూ, ఐరిష్ కౌన్సిల్ ఫర్ సివిల్ లిబర్టీస్, ది యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ ఐర్లాండ్, ది బ్లడీ సండే ట్రస్ట్, ది ఐరిష్ నేషనల్ టీచర్స్ ఆర్గనైజేషన్, ది ఐరిష్ ట్రావెలర్ మూవ్‌మెంట్, యునైట్ ది యూనియన్, ది ఎనర్జీ సర్వీసెస్ యూనియన్, ది నేషనల్ ఉమెన్స్ కౌన్సిల్ ఆఫ్ ఐర్లాండ్ తదితర సంఘాలు పాల్గొన్నాయి. బ్రిటన్ రాజధాని లండన్‌లో వేలాది మంది కదం తొక్కారు. పలస్తీనాకు మద్దతు తెలిపారు. ఇజ్రాయిల్‌కు తమ ప్రభుత్వం అండగా నిలవడాన్ని దుయ్యబట్టారు. లండన్ నిరసనలో సిన్ ఫెయిన్ నేత మేరి లౌ మెక్ డొనాల్డ్ హాజరయ్యారు. పలస్తీనా సాలిడరిటీ క్యాంపెయిన్, పలస్తీనియన్ ఫోరం ఇన్ బ్రిటన్, స్టాప్ ది వార్ కొయిలేషన్, క్యాంపెయిన్ ఫర్ న్యూక్లియర్ డిస్‌ఆర్మ్‌మెంట్, ఫ్రెండ్స్ ఆఫ్ అల్ అక్సా, ది ముస్లిం అసోసియేషన్ ఆఫ్ బ్రిటన్ సంఘాలు సంయుక్తంగా ఈ నిరసన ప్రదర్శన నిర్వహించాయి.

పలస్తీనా సమూల వినాశనమే ఇజ్రాయిల్ కోరేదన్న నినాదాలు మారుమోగాయి. అక్టోబరులో ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలైనప్పటి నుంచి లండన్‌లో జాతీయస్థాయి ప్రదర్శనలు జరగడం ఇది ఏడోసారి. అమెరికాలోనూ నిరసనలు మిన్నంటాయి. జో బైడెన్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు గళం వినిపించారు. ఇజ్రాయిల్‌కు మద్దతివ్వద్దని డిమాండ్ చేశారు. 'విధ్వంసకర జో'కు అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేది లేదని నినాదాలు చేశారు. ఆయనను ఇంటికి పంపడం ఖాయమన్నారు.

సీట్ల సర్దుబాటు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీ మూడు జాబితాలు విడుదల చేయడంతో... అభ్యర్థుల కసరత్తుపై వీరిద్దరూ మరింత వేగం పెంచాలని భావించారు. భవిష్యత్ కార్యాచరణతో పాటు టీడీపీ-జనసేన తొలి జాబితా విడుదలపై దాదాపు వీరిద్దరూ ఈ భేటీలో ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున అమరావతిలోని మందడంలో భోగి మంటల వేడుకలో చంద్రబాబు, పవన్ పాల్గొననున్నారు. 'తెలుగుజాతికి స్వర్ణయుగం-సంక్రాంతి సంకల్పం' కార్యక్రమం పేరిట మందడంలోని గోల్డెన్ రూల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న భోగి వేడుకల్లో ఉదయం 7 గంటలకు వీరిద్దరూ పాల్గొంటారు. ఈ సందర్భంగా వారు జగన్ ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాల ఉత్తర్వులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తారు. జగన్ మోసపు హామీలు, పెత్తందారి పోకడలు, నిరుద్యోగ సమస్య, గంజాయి మాఫియా, అధిక ధరలు, పన్నుల బాదుడు, జె.బ్రాండ్స్, రైతు సంక్షోభం, అహంకారం నశించాలి వంటి అంశాలతో రూపొందించిన ప్లకార్డులను భోగి మంటల్లో వేసి దహనం చేయనున్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన రైతులతో చంద్రబాబు, పవన్ ముచ్చటిస్తారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను

మోదీతోనే కావేరి జల వివాద పరిష్కారం: దేవెగౌడ

బెంగళూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ప్రకటించారు. పార్టీ ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. తన శక్తి మేరకు జేడీఎస్ కోసం శ్రమిస్తానన్నారు. బెంగళూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్నాటక మాజీ సీఎం కుమారస్వామి పోటీ చేస్తారా లేదా అన్నది ఇంకా నిర్ణయించలేదని, ప్రధాని మోదీ సూచనల మేరకు కార్యాచరణ ఉండబోతోందని దేవెగౌడ చెప్పారు. కావేరి జల వివాదాన్ని ప్రస్తావిస్తూ దీనికి పరిష్కారం మోదీతోనే సాధ్యమని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి చివరి వరకు న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ప్రతి ఏటా కావేరి జల నిర్వహణ యంత్రాంగం (సీడబ్ల్యూఎమ్ఏ)కి తమిళనాడు లేఖ రాయడం.. వెంటనే జలాలు విడుదల చేయాలని ఆదేశించడం రివాజుగా మారిందన్నారు. కావేరి రిజర్వాయర్లలో నీటి లభ్యత తెలుసుకోకుండానే సీడబ్ల్యూఎమ్ఏ ఆదేశాలిస్తోందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి రాజకీయాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మరో రెండున్నరేళ్ల పాటు రాజ్యసభలో ఉంటానని, ప్రతి సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతానని చెప్పారు. ఫిబ్రవరిలో పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధానితో దీనిపై చర్చిస్తానని దేవెగౌడ అన్నారు.

ఫిబ్రవరిలో 'హెచ్-1బీ' ఆన్‌లైన్ ఫైలింగ్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా దరఖాస్తుల కోసం ఆన్‌లైన్ ఫైలింగ్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతుంది. వీసా రిజిస్ట్రేషన్‌లను ప్రారంభించే ఆర్గనైజేషనల్ అకౌంట్స్ కూడా ప్రారంభం కానున్నాయి. వీటిని సంస్థాగత ఖాతాలు అంటారు. సంస్థాగత ఖాతాల్లో ఒక సంస్థ లేదా ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న వారి కోసం సంస్థ తరుపున పనిచేసే న్యాయ వ్యవహారాలు చూసుకునే ప్రతినిధులను హెచ్-1బీ రిజిస్ట్రేషన్‌లు, ఫారమ్ ఐ-129, వలసేతర వర్కర్ కోసం ప్రీమియం ప్రాసెసింగ్ దరఖాస్తుదారుల కోసం ఫారమ్-ఐ 907ను అనుమతిస్తుంది. యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్ (యూఎస్‌సీఐఎస్) విభాగాల్లో కీలక మార్పులు చేటుచేసుకున్నాయి. వాటిల్లో ప్రధానంగా

ఫీచర్‌లు: హెచ్-1బీ రిజిస్ట్రెంట్ ఖాతాలతో చట్టపరమైన ప్రతినిధులు, సంస్థల కోసం సంస్థాగత ఖాతాలు మెరుగైన డిజైన్ కేస్ మేనేజ్‌మెంట్ ఫీచర్‌లు అందుబాటులోకి రానున్నాయి.

ఫైలింగ్ ఆప్షన్స్ : హెచ్-1బీ పిటిషనర్లు తమ సంస్థ ఖాతాల ద్వారా ఫారమ్‌లు ఐ-129, అనుబంధిత ఫారమ్ ఐ-907 ప్రీమియం ప్రాసెసింగ్ అభ్యర్థనలను ఆన్‌లైన్‌లో ఫైల్ చేయవచ్చు. ఆన్‌లైన్ ఫైలింగ్ కోసం చట్టపరమైన ప్రతినిధి ద్వారా చేసుకోవచ్చు. లేదంటే పేపర్ ఆధారిత ఫైలింగ్‌ని ఎంచుకోవచ్చు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్ : హెచ్-1బీ వీసా నమోదు ప్రక్రియ ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది.

యూజర్ ఫీడ్ బ్యాక్ : యూఎస్‌సీఐఎస్ వివిధ స్టేక్ హోల్డర్స్‌తో కలిసి యుజబిలిటి టెస్టింగ్‌ను నిర్వహించనుంది. ఫలితంగా ఆర్గనైజేషనల్ అకౌంట్ పూర్తి స్థాయిలో మార్పులు చోటు చేసుకోనున్నాయి.

కంటిన్యూడ్ ఫీడ్‌బ్యాక్: యూఎస్ సీఐఎస్ వినియోగదారుల అభిప్రాయాన్ని సేకరించి, యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే ప్రయత్నాలు చేయనుంది.

నేషనల్ ఎంగేజ్‌మెంట్: యూఎస్‌సీఐఎస్ జనవరి 23, జనవరి 24న నేషనల్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ ప్రక్రియ ద్వారా సంస్థలు, చట్టపరమైన ప్రతినిధులకు నిర్దేశం చేసేందుకు సంస్థాగత ఖాతాల సమాచారాన్ని అందిస్తుంది.

ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్: హెచ్-1బీ ప్రక్రియలో పాల్గొన్న వ్యక్తులను సమాచార సెషన్‌లకు హాజరు కావడానికి యూఎస్‌సీఐఎస్ ప్రోత్సహిస్తుంది. సంస్థాగత ఖాతాలు, ఆన్‌లైన్ ఫైలింగ్ వివరాలు హెచ్-1బీ ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ పేజీలో అందుబాటులో ఉంటాయి.

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు

మూడు నెలల్లో ఇది నాల్గోసారి

18న విచారణకు రావాలని ఢిల్లీ సీఎంకు ఆదేశాలు

ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకునేందుకే : ఆప్ విమర్శ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ అయ్యాయి. ఈనెల 18న విచారణకు రావాలని దర్యాప్తు సంస్థ ఆయనను ఆదేశించింది. కేవలం మూడు నెలల్లోగా కేజ్రీవాల్‌కు సమన్లు జారీ కావడం ఇది నాల్గోసారి. ఈ మేరకు పార్టీ వర్గాలు శనివారం తెలిపాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్ (55) గతసారి విచారణకు హాజరు కాలేదు. ఢిల్లీ మద్యం విధానంతో ముడిపడ్డ మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం విచారణకు హాజరుకావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి. రాజ్యసభ ఎన్నికలు, గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లతో బిజీగా ఉన్నందున ఈనెల 3న విచారణకు రాలేనని కేజ్రీవాల్ అంతకుముందు చెప్పారు. ఈడీ చర్యల వెనుక వాస్తవ ఉద్దేశాన్ని ప్రశ్నించారు. సమన్లు చట్టవిరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. జడ్జి, జ్యూరి, ఎగ్జిక్యూషనర్ (న్యాయ మూర్తి, న్యాయ నిర్ణేత, శిక్షించేవారు) పాత్రలను ఈడీ ఒక్కటే పోషిస్తోందని విమర్శించారు. తనను అరెస్టు చేయడమే లక్ష్యమన్న ఆయన ఈ సమన్లు ఉపసంహరించుకోవాలన్నారు. కేజ్రీవాల్ ఆరోపణలను ఈడీ పట్టించుకోలేదు. పీఎంఎల్ఏ చట్టం ప్రకారమే ఆయనకు సమన్లు జారీచేసినట్లు తెలిపింది. తాజా సమన్లపై ఆప్ స్పందించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా కేజ్రీవాల్‌ను అడ్డుకునేందుకు ఈడీని బీజేపీ దుర్వినియోగిస్తోందని దుయ్యబట్టింది.సమన్లు జారీ చేసిన సమయాన్ని ప్రశ్నించింది. ఈనెల 18 నుంచి గోవాలో కేజ్రీవాల్ పర్యటించనున్నారని, అక్కడ పార్టీ నేతలు, వలంటీర్లతో సమావేశం కానున్నారని తెలిపింది. ఆయన గోవా షెడ్యూల్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు పేర్కొంది. కేజ్రీవాల్ ఈసారైనా ఈడీ ఎదుట హాజరవుతారా అన్న ప్రశ్నకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ స్పందిస్తూ న్యాయ సలహాదారులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, వారిచ్చే సలహా మేరకు చర్యలు ఉంటాయని చెప్పారు. ఇజ్రీవాల్ గోవా పర్యటనను శుక్రవారమే ప్రకటించామని, ఇప్పటివరకు మౌనంగా ఉన్న ఈడీ... ఆయన ప్రచారం కోసం వెళుతున్నారని ప్రకటించగానే సమన్లు జారీ చేసిందని విమర్శించారు. గతేడాది నవంబర్ 2, డిసెంబర్ 21న, జనవరి 3న కేజ్రీవాల్‌కు సమన్లు జారీ కావడం తెలిసిందే. ఇదే కేసులో ఆప్ కీలక నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్ జైల్లో ఉన్న విషయం విదితమే. ఇదిలావుంటే, కేజ్రీవాల్ పరారయ్యే వ్యక్తి తరహాలో ప్రవర్తిస్తున్నారని, ఈడీ విచారణకు ఆయన పార్టీ రాజకీయ రంగు పులుముతోందని బీజేపీ ఢిల్లీశాఖ విమర్శించారు.

అసంతృప్తులకు వల

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే సాధారణ ఎన్నికల్లో 175కి 175 సీట్లు గెల్చుకోవాలన్న లక్ష్యంతో వైసీపీ అధిష్ఠానం పెద్దఎత్తున చేపడుతున్న అభ్యర్థుల మార్పులు, చేర్పులతో అనేక మంది ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఎంపీలు రాజీనామా చేయగా, ఆరుగురు ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధంగా ఉన్నారు. వీరుగాక సీట్లు ఖరారు కాని, ఇతర నియోజకవర్గాలకు మార్చిన శాసనసభ్యులు అలకపాన్పు ఎక్కారు. ఇటువంటి వారిలో ఎక్కువ మంది టీడీపీకి క్రాస్ ఓట్లు వేస్తారని వైసీపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలను సద్వినియోగం చేసుకునే దిశలో టీడీపీ అధిష్ఠానం రాజ్యసభకు అభ్యర్థిని నిలబట్టేందుకు కసరత్తు నిర్వహిస్తోంది.

వైసీపీకి మరో షాక్

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. దీనిపై కొంతకాలంగా చర్చలు కొనసాగుతున్నాయి. సిట్టింగ్‌గా ఉన్న బాలశౌరిని తప్పించి, మరొకరికి ప్రాధాన్యత ఇవ్వడంపై బాలశౌరి అసంతృప్తి చెందినట్లు తెలిసింది. వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ కూడా రాజీనామాకు సిద్ధమయ్యారు. వైసీపీ జాబితాల విడుదల నుంచి ఈ రాజీనామాల పరంపర కొనసాగుతోంది. మొదటి జాబితా విడుదలైన వెంటనే, తనకు టికెట్ దక్కదని తెలిసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆ పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. రెండవ, మూడవ జాబితాల సమయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి వ్యవహారం వైసీపీకి తలనొప్పిగా మారింది. ఆయనకు మళ్లీ టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మాగుంటకు ఎంపీ టికెట్ ఇస్తేనే తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పట్టుపట్టారు. ఇప్పటికే మాగుంట టీడీపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. మాగుంట టీడీపీలోకి వెళ్తే, ఆయనతోపాటు బాలినేని, మరికొందరు వెళ్లే అవకాశాలున్నాయి. ఈ పరిణామాలు వైసీపీకి తలనొప్పిగా మారాయి. అటు కాపు సంఘం నేత ముద్రగడ పద్మనాభం వైసీపీలోకి వస్తారని అందరూ భావించినప్పటికీ, ఆయన ఊహించని రీతిలో జనసేన వైపునకు వెళ్లేలా చర్చలు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ముద్రగడను సంప్రదించకుండా వైసీపీ ఇన్‌చార్జిలను ప్రకటించడంపై ఆయన మనస్థాపం చెందినట్లుగా ప్రచారముంది. వైసీపీ నుంచి టికెట్లు దక్కవని తెలిసిన మరికొందరు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

15 ఏళ్లు దాటితే స్క్రాప్‌కే...

ఢిల్లీలో 54 లక్షల వాహనాల రిజిష్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఏ వాహనాలైనా 15 ఏళ్లకు మించి వాడేందుకు వీల్లేదు. కాలం చెల్లిన వాహనాలు స్క్రాప్ చేయాల్సిందే అని ప్రభుత్వం ఖరాఖండీగా చెప్పింది. 2023లో 1.42 కోట్ల వాహనాలు కాలం చెల్లిపోయినట్లు ఢిల్లీ స్టాటిస్టికల్ హ్యాండ్ బుక్ పేర్కొంది. వీటిలో 54.95 లక్షల వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు అయినట్లు పేర్కొంది. ఆరు లక్షల పైచిలుకు వాహన యజమానులు ఇతర చోట్ల విక్రయించేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) తీసుకున్నారు. ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేయకపోవడంతో 1.40 లక్షల వాహనాలను స్క్రాప్ చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాలతో 2021 డిసెంబర్ నుంచి 10 ఏళ్ల నుంచి 15 ఏళ్లు డీజిల్ - పెట్రోల్ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నామని ఢిల్లీ రవాణా శాఖ తెలిపింది. మెర్సిడెస్, బీఎండబ్ల్యూ లాంటి వాహనాలు స్క్రాప్ చేస్తే తక్కువ నగదు వస్తుంది.

శిక్ష పడేది జగన్‌కే...బాబుకు కాదు:వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే యావజ్జీవ శిక్ష పడుతుంది తప్ప టీడీపీ అధినేత చంద్రబాబుకు కాదని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడుతుందని జగన్ పగటి కలలు కంటున్నారన్నారు. ఏ సాక్ష్యాలు లేవని కోర్టులు ఘోషిస్తున్న కేసుల్లో చంద్రబాబుకు జీవితఖైదు పడితే, 11 కేసుల్లో చార్జిషీట్లు వేసిన జగన్‌కు ఎన్ని శిక్షలు పడాలని ప్రశ్నించారు. 12ఏళ్ల క్రితం జగన్‌పై వివిధ కేసుల్లో 11 చార్జిషీట్లు వేశారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిత్వాన్ని అడ్డుపెట్టుకుని క్విడ్‌ప్రోకోకు జగన్ పాల్పడలేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుపై పెట్టిన ఏ కేసులోనూ చార్జిషీట్ దాఖలు కాలేదని చెప్పారు. ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చారని తెలిపారు.చంద్రబాబుపై ఉన్న మూడు కేసులను సరిగ్గా దర్యాప్తు చేయని అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తప్పులు కనపడటం లేదని కోర్టులు చెప్పాయని, పోలీసు శాఖే తప్పు చేసిందని కోర్టు చీవాట్లు పెట్టిందన్నారు. చంద్రబాబుకు యావజ్జీవం పడుతుందని జగన్ అందరితో చెప్పుకోవడంలో అర్థం లేదని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు.

కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఆర్ ఏపీ మీడియా అకాడమీ (సీ.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ) చైర్మన్ పదవికి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు రాజీనామా ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించి... పూర్తి సహాయ, సహకారాలు అందించినందుకుగాను సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టుగా కొమ్మినేని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అనేక బాధ్యతలు నిర్వహించారు. 2022 నవంబరు 10వ తేదీన ఏపీ మీడియా అకాడమీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం 13 నెలల 15 రోజులపాటు కొనసాగింది. వర్కింగ్ జర్నలిస్టుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడం తనకు సంతృప్తి ఇచ్చిందని కొమ్మినేని తెలిపారు. ఈనెల 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండటంతో 17వ తేదీ నుంచి తన రాజీనామా అమలులోకి వస్తుందన్నారు. సీఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ హోదాలో తాను అందించిన సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు. గ్రామీణ, పట్టణ జర్నలిస్టులు, జర్నలిజంపై అభిరుచి గల వ్యక్తుల కోసం మీడియా అకాడమీ అధ్వర్యంలో జర్నలిజంలో డిప్లొమో కోర్సును నాగార్జున యూనివర్సిటీ సహకారంతో పూర్తి చేయడం తనకు అత్యంత సంతృప్తినిచ్చిందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను పత్రికాముఖంగా ప్రజలకు వివరించగలిగామన్నారు. అనంతపురం నుంచి ఉద్దానం వరకు నిర్వహించిన పర్యటనల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు తదితర మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల అభివృద్ధిని, ఉద్దానం కిడ్నీ వ్యాధుల పరిశోధనా కేంద్రం అభివృద్ధిని స్వయంగా పరిశీలించి ప్రజలకు మీడియా ద్వారా వివరించామని గుర్తుచేశారు. తన పదవీ కాలంలో సహకరించిన మీడియా మిత్రులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కొమ్మినేని శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

పాలకులలకు తగిన గుణపాఠం చెప్పాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-శింగనమల/అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతపురం నగరం లలిత కళా పరిషత్‌లో సీపీఐ జిల్లా సమితి సమావేశం శనివారం జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, హిందూ, ముస్లింల మధ్య మతాల చిచ్చు రేపుతోందని విమర్శించారు. అన్యాయాన్ని ప్రశ్నించిన వారిని దేశ వ్యతిరేకులంటూ బ్లాక్ మెయిల్ చేస్తూ వారి మీద కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా? లేక నియంత పాలన? అని ప్రశ్నించారు. కేంద్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోకడ ప్రదర్శిస్తుందని తెలిపారు. దేశం ఆర్థిక మాంద్యంతో అతలాకుతలమవుతుంటే ప్రధాని మోదీ బడా బాబులకు కొమ్ము కాస్తూ బ్యాంకు రుణాలు లక్షల కోట్లు ఎగ్గొట్టిన వారిని విమానాల్లో తిప్పుతున్నారని అన్నారు. అన్నం పెట్టే రైతన్న పంటలు పండక కాస్తో కూస్తో బ్యాంకుల్లో అప్పులు తీసుకుంటే, వారిని బ్యాంకు రుణాలు వసూలు చేసే బ్యాంకు సిబ్బంది వేధిస్తున్నారని, లక్షల కోట్లు ఎగవేసిన వారిని అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. మొదటి నుంచి ప్రధానులందరూ కలిసి రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే, మోదీ ప్రధాని అయినప్పటి నుంచి రూ.156 లక్షల కోట్ల అప్పు చేశారని, ఈ సొమ్మునంతా మోదీ తన అనుచరులకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే నిరుపేదలు కొనలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంటే ఖాళీ అయిన ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో 28 పార్టీలతో 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసుకున్నామని, ఎన్నికల ముందు ప్రజల్లోకి వెళ్లి మోదీ దుష్ట పాలనపై వివరిస్తామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కుల, మతాలకు ప్రాధాన్యమిస్తున్నారని, అప్పులు చేసి కుప్పలు పెట్టి ప్రజలపై భారం మోపుతున్నారని తెలిపారు. జగన్ నియంత పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు నెల రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తుంటే వారి సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని, మహిళలను పీడించిన ప్రభుత్వాలు కూలిపోయిన దాఖలాలు అనేకం ఉన్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించకుండా అధోగతి పాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఉందని, మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధిస్తానన్న మాట ఏమైందని ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి నిరుద్యోగులను మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలపై పాలకుల మెడలు వంచేందుకు కమ్యూనిస్టులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపి ఓటు అనే ప్రజా ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జగదీశ్ మాట్లాడుతూ మూడు నెలల్లో ఎన్నికల సందడి మొదలవుతుందని, వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని, పేదల, రైతుల జీవితాల్లో మార్పు వస్తుందని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తొలగించడం కోసం వైసీపీ కుట్ర పన్నుతుందన్న అనుమానాలు బలంగా ఉన్నాయన్నారు. తెలుగుదేశం పార్టీతో బీజేపీ కలిస్తే మైనార్టీ ఓట్లు రాకుండా టీడీపీ దెబ్బతింటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు ఎం.వి.రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, కేశవరెడ్డి, రవీంద్రనాథ్, జాన్సన్, టి.నారాయణస్వామి, డి.పెద్దయ్య, మల్లికార్జున, సంజీవప్ప, రమణ, రాజేష్, సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, రంగయ్య, సంతోష్, వివిధ గ్రామాల సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటికి షర్మిల

కుమారుడి పెళ్లికి రావాలని ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ఇంటికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిల వెళ్లారు. తన కుమారుడు రాజారెడ్డి పెళ్లి పిలుపు కోసం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబును ఆమె కలవడం ఇదే తొలిసారి. షర్మిలను చంద్రబాబు దంపతులు సాదరంగా ఆహ్వానించారు. కొద్దిసేపు కుశల ప్రశ్నలతో మాట్లాడుకున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డితో తన అనుబంధాన్ని చంద్రబాబు ఆమెతో పంచుకున్నారు. షర్మిల అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని చెప్పారు. తన కుమారుడి పెళ్లికి రావాలని, నవ దంపతులను ఆశీర్వదించాలని చంద్రబాబును కోరినట్లు తెలిపారు. తమ కుటుంబంలో వివాహాలకు చంద్రబాబును వైఎస్ఆర్ పిలిచారన్నారు. క్రిస్మస్ సందర్భంగా నారా లోకేశ్‌కు స్వీట్లు పంపానని చెప్పారు. ప్రతి విషయాన్ని రాజకీయాలతో ముడి పెట్టవద్దన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు కూడా మిఠాయిలు పంపినట్లు షర్మిల చెప్పారు. 'రాజకీయం అనేది మా జీవితం కాదు... మా వృత్తి. ప్రజా పోరాటంలో భాగంగా విమర్శలు చేసుకుంటాం. రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకూడదు. స్నేహపూర్వక వాతావరణం ఉండాలి' అని ఆమె అన్నారు. కాంగ్రెస్‌లో ఏ బాధ్యతలు చేపడతారని ఓ విలేకరి ప్రశ్నించగా 'నాకు ఏ బాధ్యతలు ఇవ్వాలనేది కాంగ్రెస్ పార్టీ ఇష్టం' అని షర్మిల బదులిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని తన తండ్రి కోరుకునేవారని తెలిపారు. రాహుల్ ప్రధాని అయితే మతకలహాలు తగ్గుతాయని షర్మిల అన్నారు.

గవర్నర్, సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకునే సంక్రాంతి పండుగకు గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. మూడు రోజుల పాటు జరుపుకునే 'సంక్రాంతి' పండుగకు మన సంస్కృతి, సంప్రదాయాలలో ముఖ్యమైన స్థానం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. కొత్త ఆశయాలకు నాంది పలుకుతూ ఈ పండుగను సమృద్ధిగా, ఆనందంతో, ఉత్సాహంగా జరుపుకుంటారు. 'సంక్రాంతి' పండుగ వేడుకలు మన ప్రాచీన సంప్రదాయాలను, సంస్కృతిని, సమసామాజిక స్ఫూర్తిని గుర్తుకు తెస్తాయి. ఈ శుభసందర్భం అందరిలో ప్రేమ, ఆప్యాయత, సౌభ్రాతృత్వం పెంపొందిస్తుంది. 'సంక్రాంతి' పండుగ తెలుగువారు అందరికీ సుఖ సంతోషాలు కలుగచేయాలని కోరుకుంటున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు.

సంక్రాంతి అంటేనే అచ్చ తెలుగు పండుగ: జగన్

సంక్రాంతి అంటేనే అచ్చమైన తెలుగు పండుగ అని, గ్రామాలకు నూతన శోభ తెచ్చే వేడుక అని సీఎం జగన్ తెలిపారు. ఇది మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ. గత 56 నెలల్లో ప్రతి గ్రామంలోనూ మనందరి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, ప్రభుత్వ బడి, ఆసుపత్రిలో నాడు-నేడు, ఇంగ్లీషు మీడియం స్కూళ్లు, బ్రాడ్‌బ్యాండ్ సదుపాయంతో అక్కడే కడుతున్న డిజిటల్ లైబ్రరీలు, ఒక్క రూపాయి లంచం, వివక్ష లేకుండా ప్రజలకు అందిన రూ.2.46 లక్షల కోట్ల డీబీటీ... ఇంటింటికీ, ప్రతి పేద సామాజికవర్గానికి చరిత్రలో ఎన్నడూలేనంతగా అందిన లబ్ధి...ఇవన్నీ పల్లెలు మళ్లీ కళకళలాడేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. నిన్నటి కంటే నేడు, నేటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించగలం అన్న భరోసా ఇవ్వగలిగితేనే ఇంటింటా సంక్రాంతి అని నమ్ముతూ ఆచరిస్తున్న ప్రభుత్వంగా...రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని సీఎం పేర్కొన్నారు.

సీఐడీకి పూచీకత్తు సమర్పించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హైకోర్టు ఆదేశాల మేరకు ముందస్తు బెయిల్‌కు సంబంధించి పూచీకత్తును శనివారం సీఐడీ కార్యాలయాల్లో సమర్పించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), మద్యం, ఉచిత ఇసుక కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. వారంలోపు రూ.లక్ష చొప్పున ఇద్దరు పూచీకత్తు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు చేయొద్దని చంద్రబాబుని ఆదేశించింది. దీనికి సంబంధించిన పూచీకత్తు ప్రక్రియను పూర్తి చేసేందుకు హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబు, నేరుగా ఏపీ సీఐడీ కార్యాలయానికి వెళ్లారు. ఉచిత ఇసుక కేసులో సీఐడీ అధికారులకు పూచీకత్తు, బాండ్ సమర్పించారు. అనంతరం ఐఆర్ఆర్ కేసులో కుంచనపల్లి, మద్యం కేసులో గుంటూరు సీఐడీ కార్యాలయాలకు వెళ్లి పూచీకత్తు, బాండ్లు సమర్పించారు. తొలుత గన్నవరం విమానాశ్రయంలో చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా ఆయనను అనుసరించారు.

శ్రీనివాసరావు సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రజలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పచ్చగా ఉండాల్సిన పల్లె సీమలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత సాగు విధానాలతో కునారిల్లుతున్నాయని విమర్శించారు. దానికితోడు కరువుకాటకాలు, వరదలు ముంచెత్తి నడ్డి విరగ్గొడుతున్నాయని, రైతులు, కూలీలు సాయం కోసం ఎదురుచూసి నిరాశపడుతున్నారని వివరించారు. ఇంకోవైపు లక్షమందికి పైగా ఉన్న అంగన్‌వాడీలు సంక్రాంతిలోపు తమ సమస్య పరిష్కారమవుతుందని, ఎదురుచూసి ప్రభుత్వ మొండి వైఖరితో నిరాశ చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించి కుటుంబాలతో పండుగ సంబరాలు జరుపుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అంగన్‌వాడీలకు అండగా నిలవాలని కోరారు.

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులపై జగన్ కపట ప్రేమ

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మండిపడ్డారు. శనివారం నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపై కన్నేసి ఐదేళ్లుగా వారిని ప్రసంగాలతో మభ్యపెట్టడమే తప్ప, ఆయా వర్గాల పిల్లలు వసతి గృహాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీసం పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు లేకపోయినా అటువైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి చూడడం లేదని విమ్మించారు. అదే పిల్లలు కనిపిస్తే మాత్రం నేను మీ మేనమామ అంటూ కథలు చెబుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,50,000 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో చాలా జిల్లాలలో హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరి, కూలిపోయే పరిస్థితిలో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే అనేక జిల్లాల్లో నూతన భవనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతి పత్రాలు అందజేయడంతో పాటు ధర్నాల ద్వారా నిరసన తెలిపామన్నారు. నాడు-నేడు పనుల కింద నూతన భవనాలు నిర్మిస్తామని బహిరంగ సభలలో ప్రసంగాలు ఇస్తున్నారే తప్ప ఆచరణలో ఎక్కడ కూడా భవనాలు నిర్మించలేదని మండిపడ్డారు. విద్యార్థులకు పడుకోవడానికి కనీసం మంచాలు కూడా లేకపోవడంతో వారు నేలపై నిద్రపోతున్నారన్నారు. దుప్పట్లు కూడా ఈ సంవత్సరం ఇంకా అందలేదన్నారు. కొన్ని జిల్లాలలోని హాస్టళ్లలో దాతలు ఇస్తున్న దుప్పట్లతో విద్యార్థులు సరిపెట్టుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భోజనం మెనూ అయితే పెంచింది కానీ పెరిగిన ధరలకు అనుగుణం మెస్ చార్జీలు పెంచలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదని, హాస్టల్‌లో గదులకు కనీసం తలుపులు, కిటికీలు కూడా లేవని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోని హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, జిల్లా ఆఫీస్ బేరర్లు నరసింహ యాదవ్, వెంకట్ నాయక్, ఆంజనేయులు, వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమామహేష్, వినోద్, రాజేష్, హరుణ్, రషీద్ పాల్గొన్నారు.



5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు కృషి

మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈ ఏడాది చివరి నాటికి దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టు సృష్టించాలనే లక్ష్యంతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో వ్యయం చేయబోతోందని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జలసౌధలో నీటి పారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున వృథా అనుత్పాదక వ్యయాన్ని సమావేశంలో బహిర్గతం చేశామని వివరించారు. పర్యవసానంగా, ప్రస్తుత ప్రభుత్వం నీటిపారుదల కింద కొత్త ఆయకట్టు పెంచడంపై దృష్టి సారించిందని, సరైన వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. కొత్త ఆయకట్టును వేగంగా ఉత్పత్తి చేయగల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన నొక్కి చెప్పారు. ప్రాజెక్టులు వ్యయం గురించి చర్చించామని, 6 నెలలు. ఏడాదిలోపు కొత్త ఆయకట్టు సృష్టించగల ప్రాజెక్టులు గుర్తించామన్నారు. ఆరు నెలల్లో ఈ లక్ష్యాన్ని సాధించే ప్రాజెక్టులపై ఖర్చు పెంచాలని నిర్ణయించామన్నారు. డిసెంబర్ 2024 నాటికి 4.5 నుండి 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టు సృష్టించడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిన ఘటనపై విజిలెన్స్ విచారణ ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావించగా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాసినట్టు చెప్పారు. నీటి హక్కుల సమస్యను ప్రస్తావిస్తూ తెలంగాణ నీటి హక్కులు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు.

షర్మిల పాత్రపై సందేహాలు?

ఏపీ కాంగ్రెస్ నేతల ఎదురుచూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిల పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధిష్ఠానం ఆమెకు ఏ పదవి కట్టబెడుతుందో స్పష్టత లేదు. సంక్రాంతి తర్వాత ఏపీకి షర్మిల వస్తారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ(వైఎస్ఆర్ టీపీ)ని షర్మిల ఇటీవల కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ఖర్గే సమక్షంలో ఆమెతోపాటు కొంతమంది అనుచరులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఏపీ ఇన్‌చార్జిగా షర్మిల వస్తారని అందరూ భావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్షుడిగా గిడుగు రుద్రరాజు కొనసాగుతున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయింది. తాజాగా షర్మిలకు పీసీసీ పగ్గాలు అప్పగించడంపై ఏఐసీసీ అధిష్ఠానం ఆలోచనలో పడినట్లు తెలిస్తోంది. ఎన్నికల ముందు షర్మిలకు బాధ్యతలు ఇస్తే...అవి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటాయా లేక ప్రతికూలంగా ఉంటాయా అనేది అధిష్ఠానం తేల్చుకోలేకపోతున్నట్లు చెప్పుకుంటున్నారు. దీంతో ఏఐసీసీలో షర్మిలకు కీలక పదవి కట్టబెట్టి, ఆ తర్వాత ఏపీకి స్టార్ క్యాంపెయిన్‌గా బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. షర్మిల ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు సేవలందించడం మాత్రం తథ్యమని కాంగ్రెస్ నేతలు నొక్కిచెబుతున్నారు. ఆ సేవలు పూర్తి స్థాయిలోనా?, ఎన్నికల వరకేనా? అనేదీ తేలాల్సి ఉంది. షర్మిలకు ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అప్పగించడాన్ని మాజీ ఎంపీ హర్ష కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్రంలో కాంగ్రెస్‌తో షర్మిల, బీజేపీతో జగన్ ఉండేలా వ్యూహం పన్నారంటూ మండిపడ్డారు. మొత్తంగా షర్మిల రాకను వైఎస్ రాజశేఖరరెడ్డి వర్గం ఆహ్వానిస్తుండగా, ఆయన వ్యతిరేక వర్గం వ్యతిరేకిస్తోంది. షర్మిల నాయకత్వంపై అతిగా ప్రచారం చేయడాన్ని కొంతమంది తప్పుపడుతున్నారు. ఏపీలో ఇంతమంది సీనియర్ కాంగ్రెస్ నేతలు ఉండగా... షర్మిలకు ప్రాధాన్యత ఇవ్వడంపై మండిపడుతున్నారు.

షర్మిలతో కాంగ్రెస్ కోలుకుంటుందా?

ఆంధ్రప్రదేశ్ విభజన, వైఎస్ జగన్ కాంగ్రెస్‌ను వీడి సొంతగా పార్టీ పెట్టడం తదితర పరిణామాలతో ఏపీలో కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బతగిలింది. పదేళ్లపాటు రాష్ట్రంలో ఉనికి కోల్పోయింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం ఒక శాతం ఓటింగ్ వచ్చింది. షర్మిల రాకతో కాంగ్రెస్ ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉంటాయని కొంతమంది వాదిస్తున్నారు. వైసీపీలో సీట్లు రాని వారు, అసంతృప్తులు టీడీపీలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటివరకు ఒకరిద్దరు మాత్రమే కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసి షర్మిల వెంట నడుస్తానని ప్రకటించారు. షర్మిలకు ఏపీ బాధ్యతలు అప్పగించకపోవడంతో ఆయన మౌనం దాల్చారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ తిరిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా అరకొర మాత్రమే కాంగ్రెస్‌లోకి వస్తున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి ఏపీలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఎలాంటి పొత్తులు లేకుండా కాంగ్రెస్ ఒంటరిగా బరిలోకి దిగితే, ఒక్క అసెంబ్లీ సీటు కూడా సాధించే అవకాశం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియా కూటమిలో ఉన్న పార్టీలతో పొత్తులు పెట్టుకుని వెళ్లేందుకు కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత షర్మిలకు అప్పగించే బాధ్యతలపైనా, కాంగ్రెస్ కూటమిపైనా ఒక స్పష్టత రానుంది.

పునశ్చరణకు ప్రాధాన్యత ఇవ్వాలి

- అధ్యాపకులకు చదలవాడ నాగరాణి సూచన
- ముగిసిన పాలిటెక్నిక్ అధ్యాపకుల శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ: శిక్షణ అంశాల పునశ్చరణకు అధ్యాపకులు పెద్దపీట వేయాలని, తద్వార విద్యార్థులను తీర్చిదిద్దాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్, సాంకేతిక విద్యాశాఖ సంయుక్త అధ్వర్యంలో పాలిటెక్నిక్ అధ్యాపకుల కోసం ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వేదికగా వారం పాటు రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇవి శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ అధ్యాపక శిక్షణా ఫలాలు విద్యార్థులకు చేరేలా ఆయా కళాశాలల్లో యాడ్ ఆన్ కోర్సులను ప్రారంభించాలన్నారు. సాంకేతికతను నిరంతరం అధ్యయనం చేయడంతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించగలరని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులలో అసక్తిని పెంచేలా నూతన ఆవిష్కరణలపై శ్రద్ధ పెట్టాలన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధితో సంపూర్ణ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించగలిగేలా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదే అని అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా బోధనను మెరుగుపర్చాలని, ప్రపంచీకరణ పరిస్థితులను నిశితంగా గమనించాలని సూచించారు. శిక్షణలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, మెకానికల్ బ్రాంచ్‌లకు చెందిన 123 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, కార్యక్రమ సమన్వయకర్తలు సుబ్బారెడ్డి, ఓఎస్డీ నాగేశ్వరావు, సాంకేతిక విద్య, శిక్షణా మండలి కార్యదర్శి రమణబాబు, సంయుక్త కార్యదర్శులు సత్యనారాయణమూర్తి, జానకి రామయ్య, ఉప సంచాలకులు డాక్టర్ ఎంఎవీ రామకృష్ణ, వేణు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఖర్గే చేతిలో "ఇండియా" చుక్కాని

ప్రతిపక్ష ఐక్య సంఘటన "ఇండియా"కు అధ్యక్షుడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఎంపిక చేశారు. బీహార్ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష ఐక్యతా యత్నాల చోదక శక్తి నితీశ్ కుమార్‌ను కన్వీనర్‌గా నియమించే అవకాశం ఉంది. శనివారం జరిగిన సమావేశానికి బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, శివసేన అధిపతి ఉద్ధవ్ ఠాక్రే ఈ సమావేశానికి హాజరు కాలేదు. వీరిని కూడా సంప్రదించిన తరవాత నితీశ్‌ను కన్వీనర్‌గా ఖరారు చేయవచ్చు. 28 పార్టీలతో కూడిన "ఇండియా" ఐక్య సంఘటనలో అతి పెద్ద పార్టీ కాంగ్రెస్ కనక ఆ పార్టీ నాయకుడిని అధ్యక్షుడిగా నియమించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఈ రోజు సమావేశానికి హాజరుకాని నాయకులు ఎవరి కారణం వారు చూపించారు. కానీ వీరు గైరుహాజరు కావడానికి "ఇండియా" ఐక్య సంఘటనలో ఉన్న విభేదాలే ప్రధానమైనవి. ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్ శాసన సభ ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు సాధ్యం కాలేదు. అక్కడితో ఆగకుండా అఖిలేశ్‌ను కాంగ్రెస్ చర్చలకు పిలిపించి అవమానించిందన్న ఆరోపణా ఉంది. అందుకనే ఆయన శనివారం సమావేశానికి దూరంగా ఉండిఉంటారు. ఏ కారణం చెప్పినా మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్ ముఖ్యమంత్రి షిండే నాయకత్వంలోని శివసేన వర్గమే అసలైన శివసేన అని తేల్చినందువల్ల ఆ వ్యథ నుంచి ఉద్ధవ్ ఇంకా కోలుకోలేదనిపిస్తోంది. కేవలం 16 గంటల ముందే "ఇండియా" సమావేశం గురించి తెలిసిందని అందువల్ల హాజరు కాలేకపోతున్నామని తృణమూల్ నాయకుడొకరు సంజాయిషీ ఇచ్చుకున్నారు. కానీ మమత రాకపోవడానికి అసలు కారణం అది కాదని అందరికీ తెలుసు. బెంగాల్‌లో కాంగ్రెస్ తనకున్న బలహీనతను దృష్టిలో ఉంచుకుని మాట్లాడాలని మమత అన్నారు. అంటే కాంగ్రెస్ ఎక్కువ సీట్లు అడగకూడదని ఆమె ఆంతర్యం. 2019 ఎన్నికలలో బెంగాల్ నుంచి కాంగ్రెస్ తరఫున ఇద్దరే ఎన్నికయ్యారు. అందువల్ల కాంగ్రెస్‌కు అంతకన్నా ఎక్కువ స్థానాలలో పోటీ చేసే అవకాశం లేదని చెప్పడం ఆమె అసలు ఉద్దేశం. బెంగాల్ లో తృణమూల్ చాలా బలంగా ఉందని మమత నమ్ముతున్నట్టున్నారు. కానీ 2019లో బీజేపీ అక్కడున్న 42 సీట్లలో 18 సీట్లు గెలుచుకున్న వాస్తవాన్ని ఆమె విస్మరిస్తున్నట్టున్నారు. ప్రతిపక్షం ఐక్యంగా పోరాడితే తప్ప బీజేపీని నిలవరించడం సాధ్యం కాదని ఆమె గ్రహించకపోవడం విచిత్రమే. ఈ సారీ కాంగ్రెస్‌ని రెండు కాకపోతే ఏ నాలుగు సీట్లకో పరిమితం చేసి, వామపక్ష ఫ్రంట్‌ను అస్సలు దగ్గరకు రానివ్వకుండా బీజేపీ విజయావకాశాలను తగ్గించడం కుదరదని తెలుసుకోకపోవడం అంతిమంగా ప్రతిపక్షాలకు విఘాతం కలిగించడమే కాక బీజేపీకి మేలు చేస్తుంది. తాము "ఇండియా" ఐక్య సంఘటనతోనే ఉన్నామని లోకసభలో తృణమూల్ నాయకుడు సుదీప్ బంధోపాధ్యాయ అంటున్నారు. కానీ కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు అంగీకరించకపోతే తృణమూల్ ఒంటరిగా పోటీ చేస్తుందని కూడా ఆయన హెచ్చరించారు. ఇది మమతా బెనర్జీలో గూడుకట్టుకున్న అతి విశ్వాసానికి సంకేతం. బెంగాల్‌లో కాంగ్రెస్ తన పరిమితులను దృష్టిలో ఉంచుకోవాలని కూడా తృణమూల్ నాయకులు అంటున్నారు. ఇది మోదీ అహంకార ధోరణిని మించిపోయింది. తృణమూల్ బెంగాల్‌లో అధికారంలో ఉండవచ్చు. వామపక్షాలు బలహీనపడి ఉండొచ్చు. కాంగ్రెస్ బలం పరిమితమే కావచ్చు.

కానీ ఇటీవల కాంగ్రెస్ బలం పుంజుకుందన్నది వాస్తవం. ప్రతిపక్షాల ఐక్య సంఘటనలో సీట్ల సర్దుబాటు సవ్యంగా జరిగితే వామపక్షాల బలమూ పెరగవచ్చు. మమతా బెనర్జీ పొరుగు మెచ్చని వైఖరికి అసలు కారణం మరొకటి ఉంది. మమత దగ్గరి బంధువు అభిషేక్ బెనర్జీతో పాటు అనేక మంది తృణమూల్ నాయకులపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు జరిగాయి. దాడులకు గురైన వారిలో మంత్రులూ ఉన్నారు. అంటే బీజేపీ మరింతగా ఈడీ ఒత్తిడి పెంచుతుందన్న భయం మమతను ఎక్కువగా పీడిస్తోంది. దాన్ని ఎదుర్కోవడానికి "ఇండియా" ఐక్య సంఘటన ఎంత బలంగా ఉంటే అంత మేలు అన్న తెలివిడి మమతలో కనిపించడం లేదు. బీజేపీని ఎదిరించడం కన్నా భయపడి లొంగి పోవడానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. బీజేపీ మళ్లీ గెలిస్తే ఎంత పెద్ద ప్రమాదమో గ్రహించకపోవడం అంటే ఇదే. మమత లాంటి వారు తాము ఎంత సెక్యులర్ అని చెప్పుకున్నా గతంలో బీజేపీతో కలిసి కేంద్రంలో అధికారంలో ఉన్న వాస్తవాన్ని ఎలా విస్మరించగలం?

"ఇండియా" ఐక్య సంఘటన అధ్యక్షుడిగా నియమితుడైన ఖర్గే మీద పెద్ద బాధ్యతే ఉంది. ఈ ఐక్య సంఘటనలోని భాగస్వామ్యపక్షాల మధ్య ఉన్న అంతర్‌వైరుధ్యాలను పరిష్కరించడమే ఆయన ప్రథమ కర్తవ్యం. దీనికోసం ఆయన నితీశ్ కుమార్, శరద్ పవార్ లాంటి వారి మద్దతు కూడగట్టగలగాలి. కాంగ్రెస్ పోటీ 255 స్థానాలకే పరిమితమవుతుందన్న వార్తలు ఇదివరకే వచ్చాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌కు లోకసభలో ఉన్నది 52 స్థానాలే కావచ్చు. కానీ 2019లో ఉన్న పరిస్థితికన్నా కాంగ్రెస్ పరిస్థితి చాలా మెరుగైంది. గెలుపోటముల మాట ఎలా ఉన్నా ప్రతిపక్షాల వైపు జనం మొగ్గు అంతకంతకూ పెరుగుతోంది. ఉత్తరాదిలో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. ఇటీవల మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోయినా ఓట్ల శాతం తగ్గలేదన్నది వాస్తవం. ఎన్నికల ఫలితాలు కేవలం గణాంకాల మీద ఆధారపడి ఉండవు. గణాంకాలను కాదని అపూర్వమైన విజయం సాధించిన సందర్భాలున్నాయి. కుదేలైన పార్టీలు పుంజుకున్న ఉదంతాలూ ఉన్నాయి. జనాభిప్రాయమే ఫలితాలను నిర్దేశిస్తుంది. ప్రజాభిప్రాయం కచ్చితంగా బీజేపీకి ప్రతికూలంగానే ఉంది. ఈ సానుకూల స్థితిని సీట్ల కింద మార్చడం ఎలా అన్న విషయంపైనే "ఇండియా" దృష్టి కేంద్రీకరించాలి. బీజేపీని ఓడించాలన్న లక్ష్యం నెరవేరడానికి అన్ని పార్టీలు సీట్ల పంపిణీలో సర్దుబాటు ధోరణి ప్రదర్శించాలి.ఈడీ కత్తి అన్ని పార్టీల మెడపైనా వేలాడుతూ ఉంది. 255 సీట్లలోనే పరిమితం కావాలన్న కాంగ్రెస్ ఆలోచన లక్ష్య సాధనకు సానుకూలమైన అంశం. మిగతా పార్టీలు కూడా ఇతర ప్రతిపక్ష పార్టీలతో సర్దుబాట్లకు సిద్ధపడితేనే లక్ష్యం సిద్ధిస్తుంది. రాష్ట్రాలలో బలంగా ఉన్న పార్టీల నాయకులు తమకు తిరుగులేదన్న అహంకారపూరిత ధోరణి అనుసరిస్తే అసలుకే మోసం వస్తుంది. గెలవాలన్న పట్టుదల, గెలుస్తామన్న ధీమా ఉంటే తప్ప "ఇండియా" కూటమి విజయం సాధించడం కుదరదు. మోదీ సర్కారు మీద ప్రజలకున్న వ్యతిరేకతను "ఇండియా" ఐక్య సంఘటనలోని పార్టీలన్నీ గమనించాలి. జనం ఆకాంక్షలను వమ్ము కానివ్వకూడదు. ప్రాంతీయంగా బలం ఉన్న పార్టీల, నాయకుల శక్తియుక్తులు బీజేపీని ఓడించడానికి ఉపకరించాలి. ఐక్య సంఘటనలోని ఇతర పార్టీలను ఎదగనివ్వకూడదనుకుంటే ఈ నాయకుల నావ సైతం మునిగిపోవచ్చు.

ఉత్తేజభరితం...కంభంపాటి జీవితం

కామ్రేడ్ సీనియర్‌గా తెలుగునాట అశేష కమ్యూనిస్టు ఉద్యమ కుటుంబానికి సుపరిచితులైన కంభంపాటి సత్యనారాయణ ఉత్తమ త్యాగాలకు, నిరంతర సిద్ధాంత అధ్యయన తత్పరతకు, శాస్త్రీయ సామ్యవాద, గతితార్కిక భౌతికవాద, చారిత్రక దృష్టితో నిశిత పరిశీలనకు మారుపేరుగా నిలిచారు. ఆదర్శ కమ్యూనిస్టుగా, విప్లవకారునిగా అర్థశతాబ్దానికిపైగా పీడిత ప్రజల సేవకు ఆయన జరిపిన కృషి యావత్ కమ్యూనిస్టు కుటుంబాన్ని ఉత్తేజపరిచింది. కమ్యూనిస్టు ఉద్యమంలో మహత్తర అధ్యాయం అనడంలో అతిశయోక్తిలేదు. పార్టీ నాయకునిగా, అధ్యయన తరగతుల నిర్వాహకునిగా, పార్టీ పత్రికల వరవడి దిద్దడంలో ప్రముఖునిగా కంభంపాటి సీనియర్ నిలిచారు. కమ్యూనిస్టు ఉద్యమానికి అయన చేసిన విశిష్ట విప్లవ సేవ, కృషి ఎన్నటికి మరపురానివి. కంభంపాటి ఆంధ్రలో తొలి కమ్యూనిస్టు. కమ్యూనిస్టు అంటే ఎలా ఉండాలో జీవితాంతం అలాగే ఉన్నారు. ఆయన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అనేక సంవత్సరాలు రహస్య, జైలు జీవితం గడిపారు. కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) సతీమణి మాణిక్యాంబగారు కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు, జాతీయోద్యమంలోను, ఆ తరువాత కమ్యూనిస్టు ఉద్యమంలోను, మహిళా ఉద్యమంలోను అవిరళ కృషిచేశారు. కంభంపాటి సత్యనారాయణ 1908 ఆగస్టు 2న తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకా దొద్దవరంలో జన్మించారు. సహాయ నిరాకర ణోద్యమ కాలంలో జాతీయ భావాలకు ఆకర్షితులయ్యారు. సైమన్ కమిషన్ బహిష్కరణలో పాల్గొని విద్యార్థి సమ్మెకు నాయకత్వం వహించారు. మద్రాసు యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, తిమ్మరాజు సత్యనారాయణ తదితరులతో కలసి రహస్య కార్యకలాపాలు సాగించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శాసనోల్లంఘనంలో పాల్గొనగా ఆరు నెలల శిక్ష విధించారు. రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించారు. గాంధీ-ఇర్విన్ ఒప్పందంతో విడుదలయ్యారు. కరాచీ కాంగ్రెస్ మహా సభకు హాజరై చర్చల్లో పాల్గొన్నారు. అతివాద రాజకీయాల వైపు మొగ్గారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీలో చేరారు. శాసనోల్లంఘనకాలంలో "రణదుంధు, వీరభారతి అనే రహస్య పత్రికలు ప్రచురించారు. 1930 దశకం ప్రారంభ దినాలలో అమీర్ హైదర్ ఖాన్ వంటి విప్లవకారులతో కలసి దక్షిణాదిన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారు. 1934లో సుందరయ్యతో కలసి ఆంధ్రలో కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా వున్నారు. అప్పటి నుంచి కమ్యూనిస్టు ఉద్యమం పట్ల అచంచలమైన విశ్వాసం, విధేయతతో ఆర్గనైజర్‌గా, జర్నలిస్టుగా, మేధావిగా బహుముఖ సేవలు అందించారు. అత్యంత వ్యయప్రయాసల కోర్చి పరిశోధనలు జరిపి రెండు వాల్యూమ్‌ల ఆంధ్ర చరిత్రపై ఒక గ్రంథాన్ని రచించారు. ఆ తర్వాత ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభ దినాలకు సంబంధించి మరో గ్రంధాన్ని రచించి ఎంతో సేవ చేశారు. 1934 వరకు ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రకు సంబంధించిన గ్రంథాన్ని పరి పూర్తి చేసే కృషిని కొనసాగిస్తూ ఆ కర్తవ్యం పరిపూర్తి కాకముందే 1983 జనవరి 16న తుదిశ్వాస విడిచారు. కాకినాడలో చదువుతుండగా సహాయ నిరాకరణోద్యమానికి ఆకర్షితుడై టౌన్ హాలులో పట్టణ, జిల్లా కాంగ్రెస్ నాయకులిచ్చే ఉపన్యాసాల్ని విడవకుండా వినేవారు. 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభ దృశ్యాలు ఆయనను ఉత్సాహపరిచాయి. 1920లో చర్ఖా ఉద్యమంలో, 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. 1930లో భీమవరంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1931లో కరాచీ కాంగ్రెస్‌కు హాజరయ్యారు. భగత్ సింగ్ అనుసరించిన మార్గం హింసాయుత మార్గం గనుక ఆయన ఉరిశిక్ష రద్దు చేయాలని కోరరాదంటూ గాంధీజీ ప్రతిపాదించిన తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేసిన వారిలో కంభంపాటి ఒకరు. కరాచీ కాంగ్రెస్ నుంచి తిరిగివస్తూ కమ్యూనిస్టు రహస్య సాహిత్యాన్ని తీసుకొనివచ్చారు. గుంటూరు జిల్లాలో టెర్రరిస్టు గ్రూపు శ్రీ కానూరి రామానందచౌదరి, శ్రీచిట్టూరి సత్యనారాయణ తదితరులతో కలసి పనిచేశారు. 1931లో దిల్లీ ప్రత్యేక కాంగ్రెస్ సభకు వెళ్లినప్పుడు అక్కడి జైల్లోవున్న టెర్రరిస్టులుగా ముద్రపడిన విప్లవకారులను కలుసుకుని వారితో సంబంధాలు పెట్టుకున్నారు. రహస్యపత్రిక వీరభారతి నడుపుతున్న ఆరోపణపై కంభంపాటిని పాలకొల్లులో అరెస్టుచేసి ఏలూరులో విచారణ జరిపి, ఆరునెలలు శిక్ష విధించారు. బళ్ళారి జైలులో ఏకే గోపాలన్, తదితరులతో కలసివున్నారు. కఠినశిక్షలో భాగంగా గానుగ తిప్పటానికి నిరాకరించినందుకు కాళ్లకు, చేతులకు బేడీలు వేసి విడిగా ఖైదీలో ఉంచారు. 1933లో విడుదల అయిన తర్వాత మద్రాసులో అప్పుడు టంగుటూరి ప్రకాశం పంతులు నడుపుతన్న స్వరాజ్య పత్రికకు మద్రాసు నగర రిపోర్టరుగా కొంత కాలం పని చేశారు. కమ్యూనిస్టు అనధికార పత్రికగా అప్పుడు హెచ్‌డీ రాజా నడిపిన న్యూయేజ్ పత్రికలో సంపాదకునిగా పని చేశారు. సందేశం, నవశక్తి, ప్రజాశ క్తి, విశాలాంధ్ర పత్రికలలో సంపాదకవర్గ సభ్యులుగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ సభ్యులుగా ఉన్నారు. 1937లో జరిగిన ఎన్నికలలో ఆనాటి జమీందారీవర్గాలు పెట్టిన పీపుల్స్ పార్టీకి వ్యతిరేకంగా ఉధృతంగా ప్రచారం చేశారు. ఆ సందర్భంలోనే తుని నియోజక వర్గంలో ఒక ప్రచార సభలో జమీందారీ మనుషులు కంభంపాటిపై దౌర్జన్యం చేశారు. తుని దివాన్‌గా ఉన్న కంభంపాటి తండ్రి పీపుల్స్ పార్టీలో ఉన్నారు. తండ్రీకొడుకులు పరస్పర ప్రత్యర్థులుగా నిలబడి హోరాహోరీ పోరాటం సాగించారు. 1952 జూన్ 22న విశాలాంధ్ర ప్రారంభమైనప్పటి నుంచి సంపాదక వర్గంలో 1956 వరకు పని చేశారు. 1956 నుంచి 1962 వరకు సందేశం సిద్ధాంత పత్రిక సంపాదకులుగా, 1962, 1965లో విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకులుగా, 1965 నుంచి 67 వరకు పార్టీ అధ్యయన శిక్షణా తరగతుల విభాగంలో పనిచేశారు. 1967 నుంచి చరిత్ర పరిశోధనలో కృషిచేస్తూ, ఆంధ్రుల సంస్కృతి చరిత్ర అన్న అంశంపై మార్క్సిస్టు దృక్పథం నుంచి చరిత్ర గ్రంథం రాశారు. ఇంగ్లీషులోను, తెలుగులోనూ ఈ గ్రంథం ప్రచురితమై అనేక మంది ప్రశంసలు అందుకుంది. అనేక ప్రామాణిక మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలను కంభంపాటి తెలుగులోకి అనువదించారు. కంభంపాటి సత్యనారాయణ వ్యక్తిగత గుణగణాలు ప్రతి కమ్యూనిస్టు నేర్చుకోతగ్గవి. ఆచరించదగ్గవి.

మోదుమూడి మురళీకృష్ణ

(జనవరి 16వ తేదీ కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) 40వ వర్ధంతి సందర్భంగా)

ఆహారభద్రతకు నీటి సంరక్షణ కీలకం

పతకమూరు దామోదర్ ప్రసాద్

భారత్ కు సుస్థిర ఆహారభద్రత సమకూరాలంటే వివిధ స్థాయిలలో నీటిని పొదుపుగా వాడుకోవడమేగాక, పల్లెస్థాయి నుండి నీటిసంరక్షణను పెద్ద ఎత్తున చేపట్టడం ఎంతో ముఖ్యం. మనకు లభ్యమయ్యే నీటిలో 2030నాటికి 87శాతం ఒక్క సేద్యపు రంగానికే కావలసి ఉంటుందని అంచనా. దేశానికి ఆహార భద్రత చేకూరాలంటే వ్యవసాయరంగంలో పంట అవసరాలకు అవసరమైనంత తప్ప ఎక్కువ నీటి వాడకాన్ని నియంత్రించడానికి చర్యలు చేపట్టడం అవసరమని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. వ్యవసాయ క్షేత్రాలలో నీటి వినియోగాన్ని, వృధాను నియంత్రించడానికి తాగునీటి యాజమాన్య పద్ధతులను పాటించకపోతే వచ్చే ఆరేళ్లలో భారత్‌కు 48 ట్రిలియన్ రూపాయల నష్టం వాటిల్లగలదని అంచనా. దేశంలో ఆహారం, ఇంధన అవసరాలు తీర్చడానికి నీరు ఎంతో అవసరం. ఇటీవలి సంవత్సరాలలో అదనులో తగినంత వర్షం కురవకపోవడంతో రిజర్వాయర్లలో తగినంత నీరు చేరడం లేదు. గత ఏడాది కూడా వానల్లేక రిజర్వాయర్లలో అతి తక్కువ నీరు చేరడంతో జలవిద్యుత్ ఉత్పాదన కుంటుపడింది. ఫలితంగా లక్షలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరా సాధ్యం కాలేదు. చాలా జలాశయాలు అడుగంటాయి.

వివిధప్రాంతాల్లో తాగునీటికి కొరత ఏర్పడుతున్నది. దేశంలో ఆహారభద్రత, జీవనోపాధుల మెరుగుదలకు ఒక ఉద్యమంలా నీటి సంరక్షణ చర్యలను చేపట్టి వృథాను అరికట్టవలసిన అవసరం ఎంతో ఉంది. 2020నాటికి మన దేశీయ అవసరాలకు 54వేల బిలియన్ లీటర్ల నీరు అవసరమైంది. కాగా వచ్చే ఆరేళ్లలో సేద్యం, దేశీయ అవసరాలకు 76వేల బిలియన్ లీటర్ల నీరు అవసరం కావచ్చని జాతీయ ఇంధనం, నీరు, పర్యావరణ మండలి అంచనావేసింది. ఒక్క సేద్యపు రంగానికే లభ్యమయ్యే నీటిలో 87శాతం నీరు అవసరమవుతుంది. అందువల్ల లభ్యమయ్యే పరిమిత నీటి వనరులను వివిధ అవసరాలకు జాగ్రత్తగా, పొదుపుగా వాడితేనే కొంతవరకు సర్దుబాటు చేయవచ్చు. లేదంటే వివిధ రంగాల్లో నీటి కొరతను ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశీయ జనాభా నీటి అవసరాలకు, పరిశ్రమలకు, సేద్యానికి ముఖ్యంగా వేసవి కాలంలో మంచినీటి కొరత ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికీ ఓ శతాబ్దకాలంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య కావేరి నదీజలాల వివాదం రగులుతున్న విషయం విదితమే. కృష్ణా, గోదావరి నదీ జలాలపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు తెలెత్తడం తెలిసిందే. వాతావరణంలో సంభవిస్తున్న పెనుమార్పులు, ఒడిదుడుకుల వల్ల తగినంత వానలు కురవని సంవత్సరాలలో రిజర్వాయర్లలో నీరు అడుగంటి జలవిద్యుత్ ఉత్పాదనకు, పారిశ్రామిక అవసరాలకు, మంచినీటికి కొరత ఏర్పడుతున్నది.

భూమి,నీరు,ఇంధనం,ఆహారరంగాలు కీలకమైనవి, సహ సంబంధం కలిగినవి. అందువల్ల ఇతర రంగాల అవసరాలు గుర్తించకుండా, సమన్వయం లేకుండా ఏ ఒక్క రంగంలో చర్యలు చేపట్టినా అవి ప్రతికూల పరిణామాలకు దారితీయవచ్చు. దేశంలో ఆహార రంగంలో స్వయంసమృద్ధి సాధనకు అమలుచేసిన హరిత విప్లవం వల్ల కూడా కొన్ని విపరీత పరిణామాలు సంభవించాయి. ఆహారోత్పత్తి పెంచడానికి పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో బోరుబావుల నుండి నీరు తోడే మోటార్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ సరఫరావల్ల, పంటల అవసరాలకు మించి భూగర్భ జలాలను తోడడంవల్ల ఉత్పన్నమైన దుష్ఫలితాలు ఇప్పటికీ వెన్నాడుతూనే ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలను అధికాధికంగా తోడడటంవల్ల భూగర్భ జల మట్టాలు పడిపోవడమే గాక, నీటిపారలలోని రసాయనాలవల్ల కలుషితమై భూసారం క్షీణించి, పంట దిగుబడులు కూడా తగ్గినట్లు తేలింది. ఈ రెండు రాష్ట్రాలలో సేద్యపు రంగంలో విద్యుత్ సరఫరాపై రూ.91వేల కోట్ల విద్యుత్ సబ్సిడీలు ఇచ్చినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. కనీస మద్దతుదారులను భారత ప్రభుత్వం ఏటేటా ఎంతో కొంత పెంచుతూ ఉండటం వల్ల నీరు అధికంగా వాడే వరి,గోధుమ,చెరకు పంటలసాగు బాగా పెరిగింది. ప్రస్తుతం నీటి నియంత్రణ లేని సాగునీటి పద్ధతులు, విచక్షణా రహితంగా నీరు తోడటంవల్ల భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోవడంపై శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సేద్యపు నీటి వాడకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల, తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వాటిల్లే నష్టం వచ్చే ఆరేళ్లలో రూ.48 వేల ట్రిలియన్‌లకు చేరగలదని, 2050నాటికి ఆనష్టాలు రూ.138 ట్రిలియన్‌లకు చేరుతుందని నిపుణులు అంచనా.

దేశంలో ఆహారవ్యవస్థలను పటిష్టం చేయడానికి, నీటిభద్రత మెరుగుదలకు 3 చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రాలలో మెరుగైన సాగునీటి వాడకం, యాజమాన్య పద్ధతులు, నీటిని పొదుపుగా వాడుకోవడాన్ని ప్రోత్సహించాలి. ముఖ్యంగా బిందు, తుంపర్ల సేద్యం ద్వారా నీటిని పొదుపుగా అవసరమైన మేరకు వాడటాన్ని ప్రోత్సహించాలి. ఈ పద్ధతులు పాటిస్తే వచ్చే ఆరేళ్లలో 47శాతం సాగునీటిని ఆదా చేయవచ్చని నిపుణులు అంటున్నారు. ప్రతి బిందువుకూ మరింత పంట అనే జాతీయ కృషి వికాస్ యోజన పథకం కింద అనేక రాష్ట్రాలు ఇప్పటికే సూక్ష్మ సాగు పద్ధతులను అమలు చేస్తున్నాయి. ఇందువల్ల 72లక్షల హెక్టార్ల భూమిలో సూక్ష్మ, సాగు పద్ధతులు అమలవుతున్నట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. వాతావరణంలో ఏర్పడే ఒడిదుడుకులను తట్టుకుని నిలిచే సుస్థిర సేద్యం, ఆహారవ్యవస్థల అభివృద్ధికి కృషి చేయాలని గత ఏడాది భారత్‌లో జరిగిన జి20 దేశాల అగ్రనాయక సమావేశం నిర్ణయించింది. నీటిపారుదల, వ్యవసాయ రంగాలలో సుస్థిర పద్ధతులను అనుసరిస్తేనే అందుకు అవసరమైన పెట్టుబడులు వస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు అవసరమైన ప్రోత్సాహకాలు కల్పించి తగు సాంకేతిక ప్రక్రియలను ప్రవేశ పెట్టడం అవసరం. ఆహారం, భూమి, నీరు, ఇంధన విధానాలను పరస్పర సమన్వయంతో అమలు చేయాలి. విధానాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమన్వయం చేయడానికి ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలి. వ్యవసాయం, రైతు సంక్షేమం, జలశక్తి, సంప్రదాయేతర ఇంధన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖలు సమన్వయంతో ఈ విధానాల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే ఇందుకోసం ప్రణాళిక, అమలు విభాగాన్ని నెలకొల్పి సత్ఫలితాలు సాధించినట్లు వెల్లడైంది. సుస్థిర సేద్యాభివృద్ధి, తద్వారా ఆహార భద్రత సాధన కోసం భూమి, నీరు, ఇంధనశాఖల మధ్య సమన్వయం సాధించి మెరుగైన యాజమాన్య పద్ధతులను అమలు చేయాలి. పల్లెలలో పంచాయతీరాజ్ సంస్థల ద్వారా ప్రజా భాగస్వామ్యంతో భూగర్భ జలాలను సమర్థంగా వినియోగించడానికి ప్రోత్సహించాలి. వాతావరణంలో తీవ్ర ఒడిదుడుకులవల్ల కరువులు, దుర్భిక్షాలు, అకాల, అధిక వర్షాలు, వడగండ్లవానల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నందున నీటి వినియోగంపై గాక, మెరుగైన నీటి సంరక్షణ పద్ధతులు పాటించే దృక్పథాన్ని అలవరచుకోవాలి. దేశంలో 62శాతం భూగర్భ జలాలను వాడుతున్నారు. ఇప్పటికే భూగర్భజలాల వాడకం ఎక్కువగా జరుగుతున్నట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. నీటి వినియోగంపై స్థానిక గణాంకాలను ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచితే నీటి సంరక్షణ పద్ధతులను మెరుగ్గా అమలుకు వీలవుతుంది. కేంద్ర ప్రభుత్వ అటల్ భూ యోజన పథకం అందుకు ఉపకరించవచ్చు. గ్రామస్థాయిలో స్థానికులే నీటిభద్రతకు అవసరమైన గణాంకాలను సేకరించాలి. ఈ పథకం కింద పంచాయితీ స్థాయిలో స్థానికులకు నీటి సంరక్షణపై శిక్షణ ఇస్తారు. ఇలా ప్రజాభాగస్వామ్యంతో భూగర్భ జలవనరుల పరిరక్షణను అమలుచేసిన చోట మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఇతర పథకాలతో సమన్వయం చేస్తే మరింత మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చు. ఉత్తమ నీటి యాజమాన్య పద్ధతులు అమలు చేస్తేనే వచ్చే ఆరేళ్లలో ఆహారభద్రత సాధించాలనే లక్ష్యం నెరవేరుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నో అత్యల్ప వర్షాలు, నీటికొరత ప్రాంతాలు ఉన్నందున, మన వాగులు,వంకలు,చెరువులు,జలాశయాలు,పరీవాహక ప్రాంతాలు ఆక్రమణలకు గురికాకుండా, పర్యావరణ,నీటి సంరక్షణ కోసం ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీనియర్ జర్నలిస్టు
ఫోన్: 9440990381.

వాల్మీకి రామాయణంలో రాముడు దేవుడు కాదు

డాక్టర్ దేవరాజు మహారాజు

వాల్మీకి రామాయణంలో రాముడు దేవుడు - అనే మాట ఎక్కడా కనిపించదు. రామాయణం అసలు పేరు 'పౌలస్య ముని వృథ' లేదా 'సీత చరితం'. ఈ రెండు పేర్లు కాకుండా అందులోని రాముడి పాత్రకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి తర్వాత కాలంలో వచ్చిన రచయితలు ఆ పాత్రను దేవుడిగా మార్చారు. కల్పనలు జోడించి, మహిమాన్వితుణ్ణి చేశారు. వాస్తవాలు తెలుసుకోవడం కోసం-వాల్మీకి రామాయణంలోకి తొంగి చూస్తే, అసలు విషయం బయట పడుతుంది! వాల్మీకి రాముణ్ణి దేవుడిగా వర్ణించలేదు. పైగా అత్యంత సాధారణ మానవుడిగా చిత్రించాడు. వాల్మీకి రామాయణంలో రాముడి మాటల్ని, చేష్టల్ని వాల్మీకి ఎలా రాశాడో, ఆ పాత్రను ఎలా చిత్రించాడో ఒకసారి గమనించండి. నిశితంగా ఆలోచించండి. విషయాలు చెక్ చేసుకోండి. అంతేగాని, దయచేసి మనో భావాలు దెబ్బతీసుకోవద్దు-సీతను వెతుకుతూ రాముడు అరణ్యంలో వెళుతున్నప్పుడు కనిపించిన వృక్షాలతో, జంతువులతో ఇలా మాట్లాడతాడు. సీత ఆచూకి చెప్పండని బతిమాలుతాడు. వాల్మీకి రామాయణం అరణ్య కాండ లోని కొన్ని విషయాలు ఇక్కడ ఉదహరిస్తున్నాను.

1. ఓ బిల్వ వృక్షమా ! బిల్వ ఫలముల వంటి స్తనములు గల నా ప్రియురాలిని చూచినచో చెప్పుము (అరణ్య కాండ 60-13) (2). కుంభ వృక్షమా ! నీ కాండము వంటి తొడలు గల సీతను గూర్చి నీకు తప్పక తెలిసి ఉండును (ఆరణ్య కాండ 60-15) (3). ఓ తాళ వృక్షమా! పక్వమైన ఫలముల వంటి స్తనములు గల సీతను నీవు చూచితివా? నీకు నాపై దయ ఉన్నచో అందమైన కటి ప్రదేశం గల సీతజాడ తెలుపుము (అరణ్య కాండ 60-18) (4). ఓ గజమా! నీ తొండము వంటి తొడలు గల సీతను నీవు చూచి ఉండవచ్చు. అందుచేత చెప్పుము (అరణ్య కాండ 60-25) (5). మన్మథ పీడితుడైన రాముడు - ఓ సీతా ! అరటి స్తంభాలతో సమానమైన నీ రెండు తొడలను అరటి ఆకులు కప్పివేయునట్లు చేసినావు కానీ, అవి నాకు కనబ డినవి. వాటిని దాచలేక పోయినావు (ఆరణ్య కాండ 62-4) (6). గుండ్రటి నా సీత స్తనములు ఎల్లప్పుడు చూచుటకు అందము గా ఉండి ఎర్రని మంచి గంధము పూసుకొనుటకు అలవాటు పడినవి. అట్టి స్తనములు- రక్తపు బురద పూయబడి, కాంతి హీనములై ఉండి యుండును. ఇది సత్యము వాల్మీకి రామాయణం : అరణ్యకాండ (63-8)

7. బంధువులెవరూ దగ్గరలేని నాకు, సీత కూడా లేకపోవుటచే రాత్రు లందు నిద్రపట్టక ఆ రాత్రులు చాలా దీర్ఘములుగా కనబడుచున్నవి-(అరణ్య కాండ 64-13) ఇక రాముడి ఆలోచనల స్థాయి గూర్చి చూడండి. సీత కనబడకుండా



పోయిందన్న బాధగానీ, ఆమె ఎక్కడ ఏ బాధలు పడుతున్నదో అనే వ్యథ గానీ రాముడిలో కనిపించడం లేదు. ఎంతసేపూ ఆమె అవయవాలు మాత్రమే గుర్తు చేసుకుంటున్నాడు. ఇక్కడ రాముడు ఒక కావ్యంలో సృష్టించిన పాత్ర. తప్పు ఏదైనా ఉంటే ఆ పాత్రను ఆ విధంగా సృష్టించిన రచయిత అయిన వాల్మీకిది తప్పు. సహచరి అయిన సీత బాధలు అర్థం చేసుకునే స్థాయిలో రాముడి పాత్ర చిత్రణ చేయలేదు. కలిసి గడిపిన రోజులలో కష్టసుఖాలు కూడా రాముడనే పాత్రకు గుర్తుకు రానీయలేదు. రామాయణం రాసిన కాలం నాటికి వాల్మీకి ఎదగని మానవ ప్రవృత్తిలో ఉన్నవాడే. సున్నితమైన ప్రేమ భావన, లాలిత్యం, విరహవేదన వర్ణించలేక పోయాడు. మనిషి మనిషిని ప్రేమించినట్లు, మనిషి మనిషిని గౌరవించినట్లు, మనిషి, మనిషితోడు కోసం తపించినట్లు వాల్మీకి రామాయణంలో ఎక్కడైనా కనిపిస్తుందా ? ముడివడి పెనవేసుకు పోయిన రెండు జీవితాల మమతానురాగాలు, దూరం పెరగడం వల్ల కలిగే లోతైన వెలితి, చెలరేగిన ప్రేమ తుపానులు ఏమైనా కనిపించాయా? లేదే - ఎందుకంటే అది ఎదగని కాలం, ఎదగని మనుషులు, అనాగరిక ఆటవిక జీవితాలు, స్త్రీ పురుషుల మధ్య ఉండే లైంగిక సంబంధాన్ని అధిగమించి హుందాగా, ప్రేమికుడిగా, జీవిత భాగస్వామిగా చేసిన ఉన్నతమైన ఆలోచనలు ఏవీ ? 1950-60 లలో వెలు వడ్డ ఏ పాత బాలివుడ్ సినిమా విరహగీతం విన్నా హృదయం ద్రవించి పోతుందే? వాల్మీకి వర్ణించిన రాముడి బాధ - విరహంలో ఏ పరిపక్వతా లేదే? అలాంటి రచనకు ఒక మహాకావ్యమని పేరా? అందులోని ఎదగని మనస్తత్వమున్న కథా నాయకుడు దేవుడా? పోనీ మనిషిగా ఆదర్శప్రాయుడా ? అలా ఓ కల్పిత పాత్రకు కోట్లు ఖర్చు చేసి ఆలయం కట్టే వారిది ఎంత విజ్ఞత ? ఓ రకంగా వాల్మీకీ, రాముడి పాత్రే నయం! ఎందుకంటే ఆ రచయితా, ఆ పాత్రా వారి కాలానికి సరిపోయే విధంగా ఆలోచించారు. అందువల్ల వారి స్థాయి అప్పటికి అంతే అని మనం సరి పెట్టుకోవచ్చు. కానీ, ఇప్పుడు అత్యాధునిక యుగంలో జీవిస్తూ, మూడువేల ఏళ్లు వెనక్కి వెళ్లి ఆలోచించేవారిని ఏమందాం? ఈ కాలానికి సరిపడని అనాగరిక మూర్ఖత్వాన్ని బలవంతంగా ప్రచారం చేస్తున్న అవివేకుల్ని ఏమందాం ? ఆనాడు వాల్మీకి ఆలోచనలు స్త్రీ అవయవాల దగ్గరే ఆగిపోయినట్టు- నేటి బూర్జువా రాజకీయ నాయకుల రాజకీయాలు కూడా అక్కడే ఆగిపోయాయి. స్త్రీ శరీరాలు నేటి రాజకీయాలకు యుద్ధ భూములు ఎందుకు అవుతున్నాయి ? మణిపూర్ జాతుల మధ్య చిచ్చులేపి, మహిళల్ని నగ్నంగా ఊరేగించడం, బహిరంగంగా సామూహికంగా రేప్ చేయడం దేనికి సంకేతం ? సమకాలీన సమాజం ఇలా తగలబడిందంటే- తరతరాలుగా ఇలాంటి అశ్లీల ఘట్టాలు, అశ్లీల కావ్యాలు చదివినందువల్ల కాదంటారా? సంస్కృతీ సంప్రదాయాల పేరుతో అశ్లీల భావజాలాన్ని వ్యాప్తి చేసినందు వల్ల కాదంటారా? స్త్రీ భోగ వస్తువు కాదు. మనసూ, శరీరం, వ్యక్తిత్వం గల ఒక మనిషి అని ఏ పురాణమైనా ఏ కావ్యమైనా చెప్పిందా ? సంస్కృతి అనే ముసుగులో ఈ కాలానికి పనికిరాని భావజాలం ప్రచారం చేస్తారా? తమ స్వార్థ చింతనతో యువతరాన్ని వెనక్కి నడిపించడమెందుకూ? జైశ్రీరామ్- నినాదాలు నేర్పించి వారి భవిష్యత్తును అంధకారంలోకి తోసెయ్యడమెందుకూ? హిందూ సంప్రదాయం ప్రకారం వివాహితుడైన వాడు ఏ పూజ అయినా భార్యతో కలిసి చేయాలి. భార్యను తన్ని తగిలేసి, అధికారికంగా విడాకులివ్వకుండా, ఒక మహిళా జీవితాన్ని నాశనం చేసిన ఓ పెద్ద మనిషి, ఒంటిలింగం లాగా ప్రతి చోటా, ప్రతి పూజ ఒంటరిగానే చేస్తుంటాడు. దానితో దేశ ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నట్టు? - మీరు కూడా మీ భార్యల్ని తన్ని తగిలేయండి. విడాకులు కూడా తీసుకోకండి. దేశాల మీద పడి ప్రజల సొమ్ముతో బలాదూరు తిరుగుతూ ఉండండి. చదువుకోకండి. ఎప్పుడు మాట్లాడినా, మనసులో లేని మాటలు- మన్‌కీ బాత్ లో మాట్లాడండి అనా? ఆదానీ, అంబానీల దగ్గర పెదపాలేరుగా పడి ఉండండనా ? ఏం సందేశం ఇస్తున్నట్టూ,

సరే, రామాయణం గురించి చర్చించుకుంటున్నాం కాబట్టి, శ్రీరాముడి భక్తులకు, రామాయణ కావ్యాన్ని చదివే వారికి నేను మరొక రామాయణం చదవమని సూచిస్తాను. అది లివింగ్ రామాయణ రచయిత అజీజ్ తరువాన. ఇది ఒక పరిశోధనాత్మక గ్రంథం. కేరళలో ముఖ్యంగా వయనాడ్ ప్రాంతంలో జనం నాలుకల మీద ఉన్న అనేక కథలు సేకరించి, ఈయన గ్రంథస్థం చేశారు. రామాయణం అక్కడే తమ ప్రాంతంలో జరిగిందని అక్కడి జనం గట్టిగా విశ్వసిస్తున్నారు. పుల్‌పల్లి దగ్గర ఆశ్రమ్ కొల్లి అనే చోట వాల్మీకి ఆశ్రమం ఉండేదని నమ్ముతున్నారు. అలాగే జడయట్టకవు అనే చోట సీత భూమిలోకి వెళ్ళిపోయిందనీ .. అక్కడ భూమి చీలిపోయినట్టు ఉన్న చోటును చూపిస్తారు. అంతే కాదు, హనుమంతుడి తోక రాసుకుపోయిన మరకను కూడా అక్కడి గ్రామీణులు చూపెడతారు. అలాంటి గుర్తులు మనకిక్కడ భద్రాచలంలో కూడా చూపెడతారు. ప్రతి చోటా స్థల పురాణాలు ఉండడం మనకు కొత్తేమీకాదు. అంటే వైదిక బ్రాహ్మణార్యులు జనాన్ని ఎంతగా ప్రభావితం చేశారన్నది మనం గ్రహించుకోవాలి. అందుకే తరచూ చెపుతుంటాను. బ్రాహ్మణిజాన్ని మోసుకు తిరిగేది ప్రస్తుతం బ్రాహ్మణులు కాదు. బ్రాహ్మణేతరులే ! రచయిత అజీజ్ తరువాన కాలికట్ లోని ఫారూఖ్ కాలేజిలో మళయాళ విభాగానికి అధిపతి కేరళ భాషా ఇనిస్టిటూట్‌లో సంపాదకుడిగా, ట్రైబల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అసిస్టెంట్ డెరెక్టర్‌గా కూడా పనిచేశారు. అంబేద్కర్ నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు పొందిన వీరి 'వాయనదన్ రామాయణ' గ్రంథానికి ఇంగ్లీషు అనువాదమే ఈ 'లివింగ్ రామాయణ'. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. ఇదికాక, మరో ఐదు గ్రంథాలు కూడా ఈ రచయిత ప్రకటించారు. కేరళలోని 'ఆదిమ రామాయణం' లో కొన్ని హేతుబద్ధమైన అంశాలున్నాయి. కేరళ, వేనాడు జిల్లా త్రిసెల్లరీలో గల ఆదిమ ఆదివాసీ తెగలవారు చెప్పుకునే కథలో- కడుపుతో ఉన్న సీతను వదిలేయడాన్ని భరించలేక రాముణ్ణి దూషిస్తూ ప్రశ్నిస్తారు. అలాగే మాతంగ చెట్టి జాతి వారి కథలో లవకుశుల గురించి భిన్నమైన కథ ఉంది. ఈ కథ ప్రకారం సీతకు ఒక్కడే కొడుకు. ఆమె వాణ్ణి వాల్మీకి దగ్గర ఉంచి, స్నానం కోసం నదీ తీరానికి వెళుతుంది. స్నానం చేసి వచ్చి కొడుకును తీసుకుని మళ్ళీ బయటకు వెళుతుంది. వాల్మీకి అది గమనించడు. తనకు అప్పగించిన పిల్లవాడు తప్పిపోయాడని అనుకుంటాడు. సీతకు ఏం సమాధానం చెప్పాలో అని భయపడి, కుశగడ్డి పరకతో ఒక పిల్లవాణ్ణి సృష్టిస్తాడు. వాడే కుశుడవుతాడు. సీతకు పుట్టినవాడు లవుడు. ఆ రకంగా లవకుశులవు తారు. వాల్మీకి సర్ది చెప్పిన మాటలకు సమ్మతించి సీత కుశుణ్ణి కూడా స్వీకరిస్తుంది. ఇక్కడ మనం ఆలోచించవల్సింది ఏమంటే- కుశ గడ్డితో పిల్లవాణ్ణి సృష్టించ గలిగిన వాల్మీకి తన దివ్య దృష్టితో లవుడి ఆచూకి తెలుసుకోలేదా ? ఇవన్నీ అభూత కల్పనలు, కట్టు కథలు అనేది ఎందుకంటే- పురాణ పాత్రలు ఒక్కసారి మానవాతీత శక్తులు ప్రదర్శిస్తాయి. మరోసారి కనీసం మనిషి కుండే అవగాహన కూడా లేకుండా వ్యవహరిస్తాయి. ఇండోనేషియా, థాయ్ ల్యాండ్ లలో రామాయణం జానపద గీతాలుగా ప్రాచుర్యం పొందింది. 'హికాయత్ సెరిరామ' ' శ్రీ రామ పతయాని రామాయణం'- ' రామ్ కె లింగ' వంటివి జానపద సాహిత్యంగా గుర్తించారు.

సుప్రసిద్ధ సాహితీ వేత్త, జీవశాస్త్రవేత్త

ప్రముఖ గాయని ప్రభ ఆత్రే కన్నుమూత

పుణె: ప్రముఖ శాస్త్రీయ సంగీత గాయని, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ప్రభా ఆత్రే (92) శనివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. గుండెపోటు రావడంతో.. పుణెలోని దీనానాథ్ మంగేష్కర్ ఆసుపత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె ముంబై వెళ్లారు. అయితే కార్యక్రమంలో పాల్గొనకముందే ఆమె గుండెపోటు వల్ల చనిపోయారు. ఆమె మృతిపట్ల మహారాష్ట్ర మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రభ ఆత్రే మృతి చెందడం బాధాకరమని, భారతీయ సంగీతం ఆమెకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, ఆమెకు హృదయ పూర్వక నివాళులు అర్పిస్తున్నానని ఫడ్నవిస్ పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సంతాపం వ్యక్తం చేస్తూ 'ప్రభాజీ మరణంతో శాస్త్రీయ సంగీతం అద్భుత శకానికి ముగింపు పలికింది. ఆమె మరణం దేశ సంగీత రంగానికి, కళా రంగానికి తీరని లోటు. ఆమెకు నివాళులు అర్పిస్తున్నాను' అని అన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆమె మృతికి సంతాపం తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో ప్రభ అంత్యక్రియలు జరపాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆమె బంధువులు విదేశాల్లో ఉన్నారు. వారు స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత అంత్యక్రియలు మంగళవారం పుణెలో నిర్వహించనున్నారు. కాగా, ప్రభా ఆత్రే 1932 సెప్టెంబర్ 13న పుణెలో జన్మించారు. ఆమెకు 1990లో పద్మశ్రీ, 2002లో పద్మ భూషణ్, 2022లో పద్మ విభూషణ్ అవార్డులు దక్కాయి. గతేడాది డిసెంబర్ 25న దేవేంద్ర ఫడ్నవీస్ ఆమెకు అటల్ సంస్కృతి అవార్డును అందించారు.

అది వర్చువల్ కూటమి: నడ్డా

న్యూఢిల్లీ: బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా శనివారం ప్రతిపక్ష కూటమి 'ఇండియా' కూటమిపై ఆరోపణలు చేశారు. ఇది వర్చువల్ కూటమి అని, ఇది వర్చువల్ సమావేశాలను కేవలం లాంఛనప్రాయంగా చేస్తుందని, వారి కుటుంబాలను, ఆస్తులను రక్షించడమే దాని నాయకుల రెండు పాయింట్ల అజెండా అని అన్నారు. ఇక్కడ బీజేపీ యువమోర్చా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తూ యువత, రైతులు, మహిళలకు సాధికారత కల్పిస్తూ, పేదరికాన్ని నిర్మూలిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు అంటే 'మోదీని తొలగించడం' అని ఆరోపించారు. 'ఇండియా కూటమి' పార్టీల సమావేశం గురించి తాను ఆరా తీస్తే, అవి వర్చువల్‌గా సమావేశమవుతున్నాయని తనకు చెప్పారని నడ్డా అన్నారు. 'వర్చువల్ కూటమి వర్చువల్ సమావేశాలను మాత్రమే చేస్తుంది. ఫార్మాలిటీల కోసమే అలా చేస్తారు' అని తెలిపారు. దివంగత ఎం.కరుణానిధి, ప్రకాశ్ సింగ్ బాదల్ వంటి ప్రతిపక్ష నాయకులు తమ పిల్లల రాజకీయ భవిష్యత్తు గురించి ఎల్లప్పుడూ ఆందోళన చెందేవారని అన్నారు. మమతా బెనర్జీ, శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లా, ఎం.కె.స్టాలిన్‌పై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇద్దరూ బెయిల్‌పై ఉన్నారని తెలిపారు. కాగా, 'ఏ సమస్యలను లేవనెత్తాలో వారు గుర్తించలేకపోతున్నారు. పేదలు, యువత, రైతులు, మహిళలను నాలుగు పెద్ద కులాలుగా ప్రధాని గుర్తించారు' అని ఆయన పేర్కొన్నారు. ఓబీసీల కోసం మోదీ ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు.

కేరళపై కేంద్రం నిర్లక్ష్యం

ప్రతిపక్షాలను చర్చకు ఆహ్వానించిన సీఎం విజయన్

తిరువనంతపురం : వివిధ అంశాల్లో రాష్ట్రం పట్ల కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యంపై చర్చించేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్... ప్రతిపక్ష యూడీఎఫ్ నేతలు వీడీ సతీషన్, పీకే కున్హాలికుట్టిని ఆహ్వానించారు రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సతీశన్, ప్రతిపక్ష ఉప నేత కున్‌హాలికుట్టితో జనవరి 15న విజయన్ చర్చలు జరుపుతారని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఒక ప్రకటనలో తెలిపింది. సీఎంవో ప్రకటన ప్రకారం... అన్ని పరిమితులను అధిగమించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా, తప్పుగా వ్యవహరించడం చర్చకు దారితీసింది. దక్షిణాది రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిన కేంద్రం 'రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన' చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రభుత్వం ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తన 'వివక్ష' చర్యలను విరమించుకోవాలని కేంద్రానికి అనేక సార్లు లేఖలు పంపినప్పటికీ, అది తన 'ప్రతీకార చర్యలను' తీవ్రతరం చేసిందని, దీనివల్ల కేరళ మనుగడ కష్టమని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది.

మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

సీఎం షిండే శిబిరానికి మిలింద్ దియోర

ముంబై: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీ మిలింద్ దియోర కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి...మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన గూటికి చేరేందుకు మిలింద్ సిద్ధమయ్యారు. మిలింద్ కాంగ్రెస్ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయన దక్షిణ ముంబై లోక్‌సభ టికెట్ ఆశిస్తున్నారు. కానీ మిత్రపక్షమైన శివసేన(యూబీటీ) ఆ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేందుకు సుముఖంగా లేదు. దక్షిణ ముంబై నుంచి అరవింద్ సావంత్(శివసేన యూబీటీ) లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కార్మిక నేతగా ఎదిగి రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్ సావంత్... దక్షిణ ముంబై నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. దీంతో ఈ టికెట్‌ను కాంగ్రెస్‌కు ఇవ్వడానికి శివసేన అంగీకరించడం లేదు. ప్రతిష్ఠాత్మక దక్షిణ ముంబై సీటును ఇతర పార్టీలకు కేటాయించేది లేదని అరవింద్ సావంత్ స్పష్టం చేశారు. అయితే మిలింద్ దియోరా అధికార శివసేనలో చేరినప్పటికీ ఆయనకు టికెట్ ఇస్తారనే భరోసా ఏమీ లేదు. దక్షిణ ముంబై నుంచి బీజేపీ అభ్యర్థి పోటీలో దిగే అవకాశం ఉంది. అయితే మిలింద్‌కు రాజ్యసభ సీటును సీఎం షిండే ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

మాండ్య లోక్‌సభకు కుమారస్వామి పోటీ

బెంగళూరు: జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఢిల్లీ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించారు. బీజేపీతో పొత్తుతో ఎంపీగా గెలిచి కేంద్రమంత్రి పదవి చేపట్టాలని కోరుకుంటున్నారు. అందులో భాగంగా మాండ్య లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని కుమారస్వామి భావిస్తున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. కేంద్రంలో మరోసారి బీజేపీకి అవకాశాలు ఉన్నాయనే సర్వేలతో కుమారస్వామి జాతీయ రాజకీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలో బీజేపీతో జేడీఎస్ ఇప్పటికే పొత్తుపెట్టుకున్న విషయం విదితమే. బీజేపీతో పొత్తుపై ఢిల్లీ పెద్దలతో చర్చలు సాగిన సమయంలో కేంద్రంలో మంత్రిని చేస్తామని కుమారస్వామికి భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాల్లో జేడీఎస్ మూడు లేదా నాలుగింటికి మాత్రమే పరిమితమై...మిగిలిన అన్ని స్థానాల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని తీర్మానించినట్లు సమాచారం. వీటిలో హాసన్, మాండ్యకు కుమారస్వామి ప్రాధాన్యత ఇస్తున్నారు. మాండ్య లోక్‌సభ స్థానం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా కుమారస్వామి రంగంలోకి దిగే అవకాశంపై రెండురోజులుగా కసరత్తు సాగుతోంది. చిక్కమగళూరు జిల్లాలోని ఓ రిసార్టులో మాండ్య జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల ముఖ్యనేతలతో చర్చలు జరిపారు. మాండ్య నుంచి ప్రస్తుతం సుమలత స్వతంత్ర ఎంపీగా ఉన్నారు. ఇటీవలే ఆమె బీజేపీకి మద్దతు ప్రకటించారు. వాస్తవానికి రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా సుమలత రంగంలోకి దిగాలని భావిస్తున్నారు.

రెండు రాష్ట్రాలలో భూ ప్రకంపనలు

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో శనివారం మధ్యాహ్నం భూకంపాలు సంభవించాయి. మధ్యాహ్నం 1.16 గంటల సమయంలో హిమాచల్‌ప్రదేశ్ చంబాలో రిక్టర్ స్కేల్‌పై 3.1 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. భూమికి తొమ్మిది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా ఎలాంటి నష్టం జరగలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మధ్యాహ్నం 1.55 గంటల సమయంలో జమ్మూ కశ్మీర్‌లోని కిష్టావర్‌లోనూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేల్‌పై 3.1 తీవ్రతతో ప్రకంపనలు రాగా... భూమికి 20 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. ఇదిలా ఉండగా.. ఇటీవల అఫ్గానిస్థాన్‌లో 6.1 తీవ్రతతో భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ప్రకంపనల ధాటికి దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి.

ఢిల్లీని వణికిస్తున్న చలి

రెడ్ అలర్టు ప్రకటించిన ఐఎండీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం ఢిల్లీలోని శివారు ప్రాంతం అయా నగర్‌లో మెహ్రౌలి-గుర్గావ్ రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మూడు డిగ్రీల సెల్సియస్ మేర తగ్గింది. వరుసగా రెండోరోజైన శనివారం కూడా అత్యంత చలి తీవ్రత ఎక్కువగా ఉన్న రాత్రిగా నమోదు కానుంది. చలి, దట్టమైన పొగమంచు పరిస్థితుల దృష్ట్యా భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి వెళ్లే 18 రైళ్లు ఒకటి నుంచి 6 గంటలపాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు వల్ల విమానాల రాకపోకలు ఆలస్యమతున్నాయి. ఈరోజు ఉదయం 5.30 గంటలకు ఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రధాన వాతావరణ కేంద్రం వద్ద 200 మీటర్ల దృశ్యమానత ఉంది. ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకున్న దృశ్యాలు కనిపించాయి. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలినాణ్యత స్థాయిలు 365గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) సమాచారం తెలిపింది. ఢిల్లీతోపాటు పంజాబ్ రాష్ట్రానికి ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొగమంచు కారణంగా హరియాణా, చండీగఢ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈరోజు ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 19 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. పంజాబ్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని శివారు ప్రాంతాల్లో చాలా దట్టమైన పొగమంచు కురిసింది. హరియాణా, ఢిల్లీ, మధ్యప్రదేవ్, బీహార్, అసోం, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పొగమంచు కురిసినట్లు వెల్లడించింది. కాగా, శుక్రవారం రాత్రి ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 3.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. లోడి రోడ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.4 డిగ్రీలు, సఫ్దర్‌గంజ్‌లో 3.6, రిడ్జ్‌లో 3.9, పాలంలో 5.8 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు ఐఎండి వివరించింది.

దేశ భద్రతపై కేంద్రం నిర్లక్ష్యం

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : దేశ భద్రత విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక 'నిర్లక్ష్యపూరిత వైఖరి' అవలంబిస్తోందని, ఎన్నికల ప్రయోజనం, ప్రధాన మంత్రి 'స్వీయ-అభిమానం'గా దీనిని చూస్తోందని కాంగ్రెస్ శనివారం విమర్శించింది. సైనిక దళాల ప్రధానాధికారి మనోజ్ పాండే తన వార్షిక విలేకరుల సమావేశంలో ఇటీవల చేసిన వ్యాఖ్యలు మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశ జాతీయ భద్రతా వాతావరణం 'తీవ్రమైన క్షీణత'ని సమయానుకూలంగా గుర్తుచేస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. '2020 మధ్యలో ఉన్న యథాతథ స్థితికి తిరిగి వెళ్లేందుకు (చైనాతో) చర్చలు కొనసాగించడమే మా ప్రయత్నం' అని జనరల్ పాండే చేసిన వ్యాఖ్య, దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత లడఖ్‌లో వారి చొరబాటు 2,000 చదరపు కిలోమీటర్ల భూభాగంలోకి చైనీయులు భారత సైనికులకు ప్రవేశాన్ని నిరాకరిస్తూనే ఉన్నారని గుర్తు చేశారు' అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజౌరీ-పూంచ్‌లో తీవ్రవాద కార్యకలాపాలు పెరిగాయని, సరిహద్దు ఆవల నుంచి రాజౌరీ-పూంచ్ సెక్టార్‌లో చొరబాట్ల కోసం మౌలిక సదుపాయాలు కొనసాగుతున్నాయని సైనిక దళాల ప్రధానాధికారి గమనించడం... నోట్ల రద్దు వల్ల లేదా జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను తొలగించడం వల్ల సీమాంతర ఉగ్రవాదం ముగుస్తుంది అని పదేపదే తప్పుడు వాదనలు చేసినప్పటికీ దాని ముప్పు కొనసాగుతోందని జైరాం రమేశ్ అన్నారు. ఆగస్టు 5, 2019 నుంచి జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో 160 మందికి పైగా సైనికులు మరణించారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జనవరి 12న పూంచ్‌లోని సైనికులపై తాజా దాడి జరిగింది. అయితే ఈ సారి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. 'దేశ భద్రత పట్ల మోదీ ప్రభుత్వ నిర్ద్వంద్వ వైఖరి, అది ఎన్నికల ప్రయోజనాల కోణం నుంచి మాత్రమే చూస్తుంది. అగ్నిపథ్ పథకం ద్వారా సైన్యం 'ఆశ్చర్యానికి గురైంది' సైనిక దళాల మాజీ ప్రధానాధికారి ఎం.ఎం.నరవాణే పుస్తకంలో వెల్లడించడం ద్వారా కూడా స్పష్టమైంది' అని అన్నారు. 'ఈ ఉదాహరణలన్నీ ప్రధాన మంత్రికి, దేశ భద్రతను కూడా అతని వ్యక్తిత్వ ఆరాధన, స్వీయ-అభిమానం కోసం ఒక సాధనంగా మార్చాయని చూపిస్తున్నాయి' అని జైరాం రమేశ్ ఆరోపించారు. 2020 జూన్ 19న చైనాకు ప్రధాని క్లీన్ చిట్ ఇచ్చారని, చొరబాటు లేదని చెప్పినప్పుడు మరణించిన సైనికులను అవమానించడమేనని, 2,000 చదరపు కిలోమీటర్లలో చైనా నియంత్రణను కొనసాగించడానికి దోహదపడిందని తెలిపారు. 'భారత జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే నిజమైన చర్యకు బీచ్ సందర్శనలు, సోషల్ మీడియా ప్రచారాలు ప్రత్యామ్నాయమని ప్రధాన మంత్రి విశ్వసిస్తున్నట్లు కనిపిస్తోంది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'ఇండియా' కూటమికి కట్టుబడి ఉన్నాం...

బెంగాల్‌లో కాంగ్రెస్ తన పరిమితి గుర్తించాలి : టీఎంసీ

కోల్‌కతా : 'ఇండియా' కూటమి వర్చువల్ సమావేశానికి దూరంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ శనివారం కూటమి పట్ల తన నిబద్ధతను ధ్రువీకరించింది. 'ఇండియా' కూటమికి కట్టుబడి ఉన్నామని, అయితే బెంగాల్‌లో కాంగ్రెస్ తన పరిమితులను గుర్తించి, దానిలో రాజకీయ పోరాటానికి నాయకత్వం వహించడానికి పార్టీని అనుమతించాలని పేర్కొంది. కూటమిని బలోపేతం చేయడం, సీట్ల పంపకంపై ఫార్ములాను రూపొందించడం, ప్రతిపక్ష పార్టీల గ్రూపింగ్‌కు కన్వీనర్‌ను కలిగి ఉండాలా వద్దా అనే నిర్ణయంపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి చెందిన పార్టీల అగ్ర నాయకులు శనివారం చర్చలు జరుపుతున్నారు. కొన్ని రోజుల క్రితం వర్చువల్ సమావేశాన్ని నిర్వహించాలని గతంలో చేసిన ప్రయత్నం కార్యరూపం దాల్చకపోవడంతో ఇది రెండో ప్రయత్నం. ఈ పరిస్థితి గురించి తెలిసిన ఒక టీఎంసీ ఎంపీ, కూటమి పట్ల పార్టీ 'అంకితభావాన్ని' నొక్కి చెప్పారు. 'మేము 'ఇండియా' కూటమికి కట్టుబడి ఉన్నాము. బీజేపీని ఓడించడానికి కలిసి పని చేయాలనుకుంటున్నాము. అయితే రాష్ట్రంలో పోరాటానికి నాయకత్వం వహించడానికి వారి కాంగ్రెస్ నాయకత్వం, బెంగాల్ విభాగం పరిమితులు, బలహీనతలను గుర్తించాలని మేము హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము' అని చెప్పారు. మమతా బెనర్జీకి ముందుగా నిర్ణయించబడిన కార్యక్రమాలు ఉన్నందున వర్చువల్ సమావేశానికి హాజరుకావడం లేదని టీఎంసీ శుక్రవారం తెలిపింది.

అంతకుముందు, రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సీట్ల పంపకంపై కాంగ్రెస్ జాతీయ కూటమి కమిటీతో సమావేశాలకు ప్రతినిధులను పంపడానికి టీఎంసీ నిరాకరించింది. దాని ముందస్తు వైఖరిని కాంగ్రెస్‌కు తెలియజేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఆధారంగా పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ కాంగ్రెస్‌కు రెండు సీట్లు ఇవ్వడానికి ప్రతిపాదించింది. అయితే ఆ ప్రతిపాదన సరిపోదని కాంగ్రెస్ భావించింది. కాగా, రాష్ట్రంలోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకుగాను కాంగ్రెస్‌కు మూడు నుంచి నాలుగు స్థానాలు ఇవ్వాలని టీఎంసీ భావిస్తోందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

సాధువులపై మూకదాడి

బెంగాల్ ఉద్రిక్తం

తృణమూల్‌పై బీజేపీ మండిపాటు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని పురూలియా జిల్లాలో సాధువులపై దాడి ఘటన సంచలనం సృష్టించింది. గంగానగర్ ఉత్సవాల కోసం వెళుతున్న సాధువుల బృందంపై అల్లరిమూక దాడి చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగి దాడికి పాల్పడిన 12 మందిని అరెస్టు చేశారు. దీంతో రాష్ట్రంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ ఘటనను బీజేపీ తీవ్రంగా ఖండించింది. తనకు అనుకూలంగా మార్చుకోవడానికి కుట్రలు చేస్తోంది. ఇది అధికార తృణమూల్ కాంగెస్ పనేనంటూ విమర్శలు గుప్పించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం గంగాసాగర్ వెళ్తున్న సాధువుల బృందం దారి కనుక్కునేందుకు కొందరు మహిళలకు దగ్గరకు వెళ్లారు. భస్మ వేషధారణతో ఉన్న సాధువులను చూసి మహిళలు కేకలు వేయడంతో కొంతమంది అక్కడకు చేరుకొని సాధువులపై దాడి చేశారు. బట్టలు చింపి, చితకబాదారు. ఈ దాడిలో ఎలాంటి మతపరమైన కోణం కనిపించలేదని పోలీసులు తెలిపారు. అరెస్టయిన వ్యక్తులలో ఎవరైనా ముస్లింలు ఉన్నారా అనేది తెలుసుకుంటున్నట్లు చెప్పారు. సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని సాధువులను కాపాడామని, వారంతా క్షేమంగా గంగాసాగర్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు.

కాగా, రాష్ట్రంలో శాంతి భద్రతల యంత్రాంగం పూర్తిగా విఫలమైందని బీజేపీ ఆరోపించింది. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆ పార్టీ నేతలు ఆక్షేపణ తెలిపారు. గంగాసాగర్ వెళ్తున్న సాధువులపై విచక్షణా రహితంగా దాడి చేయడం తృణమూల్ హయాంలో దిగజారుతున్న భద్రతకు ప్రత్యక్ష నిదర్శనమని హుగ్లీ బీజేపీ ఎంపీ లాకెట్ ఛటర్జీ ట్వీట్ చేశారు. మమతా బెనర్జీ హయంలో షాజహాన్ వంటి ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తూ, సాధువులపై క్రూరంగా దాడులు జరుపుతున్నారని ఆమె విమర్శించారు. బెంగాల్‌లో హిందువుల పరిస్థితికి ఇది నిదర్శనమన్నారు.

ఘటన దురదృష్టకరం: తృణమూల్

సాధువులపై దాడి ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని, వాస్తవాలు బయటకు వస్తాయని పురూలియా టీఎంసీ అధ్యక్షుడు సౌమెన్ బెల్తారియా తెలిపారు. ఈ సంఘటన జరిగి ఉండాల్సింది కాదని ఆయన పేర్కొన్నారు. సాధువులపై దాడి జరిగిందంటూ వదంతులు వ్యాప్తి చెందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని సాధువులను రక్షించినట్టు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియో చూశామని, ఈ ఘటన ఎలా జరిగిందనే దానిపై పోలీసులు వాస్తవాలు వెలికి తీస్తారని చెప్పారు.

అయోధ్యలో రామమందిరం నా తండ్రి కల

ప్రతిష్ఠాపన రాష్ట్రపతి నిర్వహించాలి: ఉద్ధవ్ ఠాక్రే

ముంబై: మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే మరోసారి బీజేపీపై విరుచుకుపడ్డారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం తన తండ్రి బాలాసాహెబ్ ఠాక్రే కల అని అన్నారు. ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్ధవ్ ఠాక్రే శనివారం మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం నిర్మించాలన్న తన తండ్రి బాలాసాహెబ్ కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. తాను రాముడి భక్తుడితోపాటు దేశ భక్తుడినని తెలిపారు. అయితే అంధ భక్తుడ్ని మాత్రం కాదన్నారు. కాగా, గుజరాత్‌లో సోమనాథ్ ఆలయం పునరుద్ధరణ కార్యక్రమం దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా జరిగిందని ఉద్ధవ్ ఠాక్రే గుర్తు చేశారు. అయోధ్యలో రామ మందిరం దేశానికి గర్వకారణమని, దేశ ఆత్మగౌరవానికి సంబంధించినదని, దీని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని రాష్ట్రపతి ముర్ము నిర్వహించాలని ఆయన సూచించారు. విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన గురించి శంకరాచార్యులతో చర్చించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. మరోవైపు జనవరి 22న తమ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి నాసిక్‌లోని చారిత్రక కాలారం ఆలయాన్ని సందర్శిస్తామని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. అక్కడ గోదావరి నది ఒడ్డున మహా హారతి నిర్వహిస్తామని చెప్పారు. 1992 నాటి కరసేవలో పాల్గొన్న శివ సైనికులను సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం పంపినట్లు వెల్లడించారు.

సచిన్ టెండూల్కర్‌కు ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వానం

ముంబై: మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు అయోధ్యం ఆహ్వానం అందింది. జనవరి 22వ తేదీన అయోధ్యలో రామాలయం ప్రారంభానికి హాజరు కావాలని సచిన్‌కు ఆహ్వానం పంపారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. అందులో భాగంగా మాజీ క్రికెటర్ సచిన్‌కు కూడా ఆహ్వానం అందింది. శనివారం ఆయనకు ఆహ్వాన లేఖ అందజేశారు. శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర సుమారు 8 వేల మందిని ఈ వేడుకకు ఆహ్వానించింది. ఆ జాబితాలో క్రికెటర్లు సచిన్, విరాట్ కొహ్లి ఉన్నారు. బాలీవుడ్ హీరో అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్, వ్యాపారవేత్తలు ముకేశ్ అంబానీ, రతన్ టాటా ఉన్నట్లు తెలుస్తోంది.

చట్టసభ లోపల 'మహారాణి' టీవీ షూటింగ్

విమర్శలు గుప్పిస్తున్న ప్రతిపక్ష నేతలు

డ్రామా సెట్‌గా జమ్మూకశ్మీర్ అసెంబ్లీ

శ్రీనగర్ : ఐదు సంవత్సరాల నిద్రాణం తర్వాత జమ్మూకశ్మీర్ అసెంబ్లీ మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించింది. అయితే కశ్మీర్‌కు చెందిన ప్రముఖ నాయకుల ఆగ్రహం మాత్రం కొనసాగుతోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కరువయ్యింది. కానీ ఇప్పుడు అసెంబ్లీ తిరిగి పునరుద్ధరించబడినదంతా కేవలం టీవీ ధారావాహిక కోసమే మాత్రమే. అసెంబ్లీ సాక్షిగా 'చర్య' అనివార్యంగా 'కట్' ద్వారా అనుసరించబడుతుంది. అసెంబ్లీ సముదాయం లోపల 'మహారాణి' హిందీ టీవీ ధారావాహిక చిత్రీకరణకు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పాలనా యంత్రాంగం అనుమతించింది. ఈ ధారావాహికలో ప్రముఖ నటుడు హుమా ఖురేషి నటిస్తున్నారు. 2018 నుంచి అసెంబ్లీని స్తంభింపజేసిన ఈ అసెంబ్లీ భవనంలో టీవీ ధారావాహిక నటులతో నిజ జీవిత రాజకీయ నాయకుల గాయాలకు ఇది మరింత 'ఉప్పు' రుద్దినట్లయ్యింది. 1990వ దశకంలో లాలూ ప్రసాద్ కాలంలో బీహార్‌లో జరిగిన రాజకీయ సంఘటనల నుంచి ఈ సీరియల్‌ను రూపొందించారు. దాణా కుంభకోణంలో ముఖ్యమంత్రి పదవికి బలవంతంగా రాజీనామా చేయవలసి వచ్చిన లాలూ ప్రసాద్, భార్య రబ్రీ దేవిని తన వారసురాలిగా నియమించినప్పుడు 1990లలో బీహార్‌లో జరిగిన రాజకీయ సంఘటనల నుంచి ఈ ధారావాహిక ప్రేరణ పొందింది. గత ఏడాది అక్టోబరులో మహారాణి బృందం మూడో సీజన్ షూటింగ్‌ను అసెంబ్లీ భవనంలో ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. మొదటి రెండు సీజన్లు కూడా అసెంబ్లీ భవనంలోనే చిత్రీకరించారు. నిజమైన రాజకీయాల సందడి లేనప్పుడు చిత్రీకరణకు అనువైన ప్రదేశంగా మార్చబడింది. ఏది ఏమైనప్పటికీ ఈ విషయం ఇప్పుడు మాత్రమే ప్రజలకు తెలుసు. అసెంబ్లీ భవనంలో ఒక టీవీ ధారావాహిక చిత్రీకరణకు అనుమతి ఇవ్వడంపై ప్రతిపక్ష నేత ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అసెంబ్లీని సినిమా సెట్‌గా మార్చాలన్న పరిపాలనా నిర్ణయం 'పూర్తి అవమానం' అని విమర్శించారు. భవనంలో షూటింగ్ జరుపుకుంటున్న అనేక చిత్రాలను ఆయన పోస్ట్ చేశారు. 'ప్రజాస్వామ్య తల్లి' యొక్క నిజమైన ముఖం. ఇక్కడ ఒకప్పుడు అన్ని పార్టీలు, మతాలు, నేపథ్యాల భాగాల నుంచి ఎన్నికయిన ప్రజాప్రతినిధులు చాలా ప్రాముఖ్యత ఉన్న విషయాలపై చట్టాలు రూపొందించారు. ఇప్పుడు నటీనటులు, ఇతరులు దీనిని టీవీ డ్రామాలకు సెట్‌గా ఉపయోగిస్తున్నారు' అని మాజీ ముఖ్యమంత్రి అబ్దుల్లా శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'జమ్మూకశ్మీర్‌లో ఒకప్పుడు కూర్చొని పరిపాలించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం చిహ్నాన్ని ఈ విచారకరమైన స్థితికి తగ్గించడం ఎంత అవమానకరం. వారు (మహారాణి నిర్మాతలు) కూడా నేను 6 సంవత్సరాలు ఆక్రమించుకునే అవకాశం కల్పించిన ఆఫీస్ నుంచి ఒక నకిలీ సీఎం బయటకు వస్తున్నాడు. ఎంత అవమానకరం !!!!' అని పేర్కొన్నారు. మెహబూబా ముఫ్తీ ప్రభుత్వానికి బీజేపీ మద్దతు ఉపసంహరించుకున్న సుమారు ఆరు నెలల తర్వాత, డిసెంబరు 20, 2018న గవర్నర్ సత్యపాల్ మాలిక్ సభను రద్దు చేసినప్పటి నుంచి జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ పని చేయడం లేదు. నవంబర్ 2018లో ప్రత్యర్థి ఒమర్ మద్దతు ఇస్తానని వాగ్దానం చేయడంతో మెహబూబా మళ్లీ ప్రభుత్వం ఏర్పాటుకు అభ్యర్థించారు. ఆమె తన అభ్యర్థనను గవర్నర్ కార్యాలయానికి ఫ్యాక్స్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ అది జరగలేదని పేర్కొంది. గవర్నర్ మాలిక్ తన కార్యాలయంలోని ఫ్యాక్స్ మిషన్ విరిగిపోయిందని చెప్పారు. గవర్నర్ వాదనపై ఒమర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ ఏర్పాటు కోసం అభ్యర్థన లేఖను అందుకోలేదు. కానీ అసెంబ్లీని రద్దు చేస్తూ లేఖ పంపబడింది. ఇది శ్రీనగర్‌లోని ట్రాఫిక్ మనుషుల్లాగా రోడ్లపై వన్‌వే ట్రాఫిక్‌ను అనుమతించింది' అని ఒమర్ పేర్కొంటూ, 'ఇది కూడా వన్ వే ఫ్యాక్స్, ఇన్‌కమింగ్ ఫ్యాక్స్ లేదు కానీ అవుట్‌గోయింగ్ ఫ్యాక్స్ మాత్రమే' అని అన్నారు.

బీజేపీ విషకౌగిలిలో వైసీపీ, టీడీపీ

- విపక్షాలను బెదిరిస్తున్న మోదీ సర్కారు
- నారాయణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: రాష్ట్రంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ...బీజేపీది విషకౌగిలిలో చిక్కుకున్నాయని, దీనివల్ల తెలుగు ప్రజలకు తీవ్రనష్టం జరుగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. సీఆర్ భవన్‌లో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యతో కలసి ఆయన శనివారంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బీజేపీ ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని నారాయణ ధ్వజమెత్తారు. తన వ్యతిరేక పార్టీల నాయకులపై సీబీఐ, ఈడీ కేసులు బనాయిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నదన్నారు. మద్యం కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించిందని, అదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్ కుమార్తె కవితను ఎందుకు అరెస్టు చేయలేదని నారాయణ ప్రశ్నించారు. బీజేపీకి లొంగిపోవడం వల్లే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందన్నారు. విభజన తర్వాత తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు మోదీ సర్కారు ఏమాత్రం సాయమందించలేదని ఆరోపించారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప స్టీల్‌ప్లాంట్, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సుదీర్ఘకాలం బెయిల్‌పై ఉన్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉంటే కాపాడతారు...కాదంటే ఇబ్బందులకు గురిచేసార్తన్నారు. చివరకు చంద్రబాబును కూడా బీజేపీ జైలుకు పంపిందన్నారు. తనతో కలిసి పనిచేయాలని చంద్రబాబుపై బీజేపీ ఒత్తిడి చేస్తోందని విమర్శించారు. బీజేపీకి సహకరించకపోతే మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తుందని చంద్రబాబు భయపడుతున్నారని నారాయణ చెప్పారు. ఎన్నికల కమిషన్, సీబీఐ,న్యాయ వ్యవస్థలను బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తున్నదని పేర్కొన్నారు. బీజేపీకి మద్దతు ఇవ్వడానికి వైసీపీ, టీడీపీ పోటీ పడుతున్నాయని, అందుకే తెలుగువారికి అన్యాయం జరుగుతోందన్నారు. పార్టీ ఫిరాయింపుల్లో వైసీపీ, టీడీపీ నేతలు పోటీ పడుతున్నారన్నారు. సీపీఐ, సీపీఎం ఇండియా కూటమికి అనుకూలంగా ఉన్నాయన్నారు. చంద్రబాబుఇండియా కూటమిలో కలిస్తే తెలుగువారికి మేలు జరుగుతుందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల జోలికి వెళితే జగన్‌కు తిప్పలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 22న రామజన్మభూమి ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్రమోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెళ్లడం మంచిది కాదన్నారు. లౌకికదేశమంలో రాజ్యాంగ పదవులు చేపట్టిన వారు మత కార్యక్రమాల్లో భాగస్వాములు కారాదని నారాయణ చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, సీనియర్ నాయకుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదానంద గౌడ్ | ఇంద్రశేఖర్ మిత్రా | సుధీర్ బాబు | కత్తి నరసింహారెడ్డి

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గం ఏకగ్రీవం

తెలుగు రాష్ట్రాలకు అగ్రస్థానం

విశాలాంధ్ర–కర్నూలు సిటీ: ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అన్సారీ (మహారాష్ట్ర) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు కర్నూలులోని బీఏఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరిగాయని, రెండవ రోజు జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గంలో అధ్యక్షుడుగా ఇంద్రశేఖర్ మిత్రా (బీహార్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కత్తి నరసింహారెడ్డి మాజీ ఎమ్మెల్సీ (ఆంధ్ర ప్రదేశ్), జనరల్ సెక్రటరీగా సదానంద గౌడ్ (తెలంగాణ), వర్కింగ్ జనరల్ సెక్రటరీగా అన్సారీ (మహారాష్ట్ర), కోశాధికారిగా జోసెఫ్ సుధీర్ బాబు (ఆంధ్ర ప్రదేశ్), ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం (తమిళనాడు), శుభోద్ దత్తు (పశ్చిమ బెంగాల్), గంగారాం (రాజస్థాన్), వీరేంద్ర చౌహాన్ (హిమాచల్ ప్రదేశ్), సురేంద్ర కుమార్ (పంజాబ్), కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్ (ఉత్తర ప్రదేశ్), అష్రఫ్ షేక్ (జమ్మూకశ్మీర్), మనో శర్వాజ్ (హరియానా) ఎన్నికయ్యారు. మూడు ఏళ్లపాటు ఆ పదవుల్లో కొనసాగుతారు. ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గంలో తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ప్రతినిధులు ఎన్నిక కావడం పట్ల ఏపీ ఎస్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, అజాం బేగ్, టి.కె.జనార్ధన్, డి.మౌలాలి, సి.నాగరాజు, దేవప్రసన్న రాజు, పాలయ్య, రామ్‌మోహన్ రెడ్డి వారికి అభినందనలు తెలిపారు.

తిరస్కరించిన సీఎంను కాదు: చౌహాన్

భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ...మోహన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. దాదాపు 18 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేబినెట్‌లోకి తీసుకోలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ వ్యవహారంపై శివరాజ్ సింగ్ స్పందించారు. పుణెలో జరిగిన ఓ సమావేశంలో చౌహాన్ మాట్లాడుతూ ప్రస్తుతం తాను మాజీ ముఖ్యమంత్రినని, ప్రజలు తిరస్కరించిన సీఎంను కాదని చెప్పుకున్నారు. పదవిలో లేనంత మాత్రాన దాని అర్థం క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు కాదని, పదవుల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. ప్రజాసేవ చేసేందుకే వచ్చానని, సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రులుగా పని చేసిన నేతలపై ప్రజలు చాలాసార్లు అసహనం వ్యక్తం చేశారన్నారు. కానీ కొన్నేళ్లుగా సీఎంగా పనిచేసి... ప్రస్తుతం పదవిలో లేకపోయినా ప్రజలు తనపై ప్రేమ చూపుతున్నారని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా మామా అంటూ ఆప్యాయంగా పలకరిస్తున్నారన్నారు. తనపై ప్రజలు చూపుతున్న ఈ ప్రేమే నిజమైన ఆస్తి అని వ్యాఖ్యానించారు. తాను అహంకారంతో మాట్లాడడం లేదని, ఇప్పటివరకు 11 సార్లు ఎన్నికల్లో గెలిచానన్నారు. మరోవైపు తన తండ్రిపై వస్తున్న వార్తలపై శివ రాజ్ సింగ్ కుమారుడు కార్తికేయ్ చౌహాన్ స్పందించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఒకవేళ అలా జర గని పక్షంలో బీజేపీ ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

సామ్రాజ్యవాదం నశిస్తేనే ప్రపంచ శాంతి

- విజయవాడ, హైదరాబాద్‌లో పలస్తీనాకు సంఘీభావంగా భారీ ప్రదర్శనలు
- పాల్గొన్న వామపక్షాలు, వివిధ సంఘాలు

విశాలాంధ్ర–విజయవాడ/హైదరాబాద్ : సామ్రాజ్యవాదం నశిస్తేనే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని వక్తలు అన్నారు. గాజాలో పలస్తీనియన్లపై జరుగుతున్న మారణ హోమం తక్షణమే ఆపాలని, షరతులు లేని కాల్పుల విరమణ జరగాలని డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిని ఖండిస్తూ, శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిస్తూ పలస్తీనా ప్రజలకు అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం 'గ్లోబల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ గాజా' పురస్కరించుకొని విజయవాడ, హైదరాబాద్‌లో వామపక్ష ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య సంఘాలు, పౌరహక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, ట్రాన్స్‌జెండర్ సంఘాలు, మైనారిటీ, విద్యార్థి, యువజన సంఘాలు భారీ ప్రదర్శనలు నిర్వహించాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా భారీ మానవహారం చేస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు అనేక మంది ప్రదర్శనకారులను అరెస్టు చేశారు. పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు, యుద్ధ ఉన్మాదం అరికట్టాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఏపీ పలస్తీనా సంఘీభావ కమిటీ అధ్వర్యంలో ప్రగతిశీల ప్రజా సంఘాల వేదిక (సంగమం), అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో), భారత స్నేహ సాంస్కృతిక సహకార సంఘం (ఇస్కఫ్) పలస్తీనాకు మద్దతుగా సంఘీభావ శాంతి ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రాఘవయ్య పార్కు వద్ద నుంచి ఎంజీ రోడ్డు రాజగోపాలాచారి వీధి, మార్క్స్ రోడ్, మీదుగా లెనిన్ కూడలి వద్దకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో ముస్లిం మహిళలు విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం సంగమం కన్వీనర్ బుడ్డిగ జమీందారు అధ్యక్షతన సమావేశం జరిగింది. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ పలస్తీనాపై 75 ఏళ్లుగా ఇజ్రాయిల్ దాడులు చేస్తోందన్నారు. పలస్తీనా పక్షాన నెల్సన్ మండేలా పోరాడారని గుర్తు చేశారు. నెతాన్యాహూ రాజీనామా చేయాలని నేడు లక్షలాది మంది రోడ్డుపైకి వచ్చి నినదిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ న్యాయ స్థానం ముందు ఇజ్రాయిల్ దొంగ వీడియో క్లిపింగ్‌లతో హాజరైయిందని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా పలస్తీనీయులు త్యాగాలు చేస్తున్నారని చెప్పారు. దాదాపుగా నాలుగు నెలలుగా గాజా పట్టణం మీద దాడులు చేస్తూ చిన్నారులు మహిళలు లక్ష్యంగా ఇజ్రాయిల్ తన నైజాన్ని ప్రదర్శిస్తోందన్నారు. భారత ప్రభుత్వం గత సంప్రదాయాలకు విరుద్ధంగా ఇజ్రాయిల్‌కు కొమ్ముకాస్తోందని మండిపడ్డారు. సీపీఐ (ఎంఎల్) నాయకులు పి.ప్రసాద్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, జనసాహితి కార్యదర్శి దివి కుమార్, భారత్ బచావో సంఘం కన్వీనర్ చిగురుపాటి భాస్కర రావు, ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ వర ప్రసాద్, విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాస్, స్టూడెంట్స్ ఆఫ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ విద్యార్థులు, హనీఫా తదితరులు ప్రసంగించారు. ఈ ప్రదర్శనకు అయిప్సో రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు, ఇస్కఫ్ కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్

నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్ర రావు, ఇన్సాఫ్ కార్యదర్శి సయ్యద్ అఫ్సర్, జమాతే ఇస్లాం నాయకులు ముషాహిద్ బేగ్, ఖమితా సల్మా, అమీర్ ఫాహద్, మహబూబ్ ఆజం, గంగా భవాని, వివిధ సంఘాల నాయకులు మూలి సాంబశివరావు, కొట్టు రమణారావు, వియ్యపు నాగేశ్వరరావు, లంకె సాయి కుమార్, డాక్టర్ సుజాత, డాక్టర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అడ్డుకున్న పోలీసులు... ఉద్రిక్తత

హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం వద్ద భారీ మానవహారం చేపట్టారు. ప్లకార్డులు చేతబూని భారత, పలస్తీనా జాతీయ పతకాలతో గాజాలోని సామాన్య ప్రజలపై బాంబు దాడులు ఆపాలని, చిన్నారులను రక్షించాలంటూ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా, పలస్తీనాకు సంఘీభావంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అఖిల భారత ప్రగతిశీల ఫోరం తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ బాంబు దాడులతో సామాన్య పలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి భూమి, జీవనోపాధి నాశనమవుతోందని తెలిపారు. న్యాయం కోసం పోరాడుతున్న పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఉంటామని ప్రకటించారు. కాగా, మానవహారం నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడంతో మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం వద్ద ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. పోలీసులు ఓవరాక్షన్ చేసి వి.ఎస్.బోస్, బి.స్టాలిన్, డా.సోమసుందర్ మర్ల, అనిల్, లక్ష్మణ్, తన్వీర్ తదితరులను అరెస్ట్ చేశారు. ఈ అరెస్టులను నిరసిస్తూ పోలీసులతో నిరసనకారులు వాగ్వాదానికి దిగగా, పోలీసులు దూరంగా జరిగిపోయారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నేత డి.కృష్ణకుమారి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, పౌరహక్కుల నేత జయ వింధ్యల, ప్రో. పద్మజ షా, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సీపీఐ నాయకులు నిర్లేకంటి శ్రీకాంత్, సీహెచ్ శ్రీనివాస్, సత్య ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

12 మంది దుర్మరణం

ఖాట్మండు: నేపాల్‌లోని దంగ్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 12 మంది దుర్మరణం చెందగా, మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నారు. ఓ ప్రయివేటు బస్సు నేపాల్‌గంజ్‌లోని బంకే నుంచి ఖాట్మండుకు ప్రయాణికులతో బయల్దేరింది. రాప్తి నది మీదుగా వెళ్తున్న సమయంలో బస్సు అదుపుతప్పి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎనిమిది మందిని గుర్తించామన్నారు. ఈ ప్రమాదంలో మరో 22 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. ఇద్దరు భారతీయుల్లో ఒకరు యూపీకి చెందిన మునే(31), బీహార్‌కు చెందిన యోగేంద్ర రామ్(67) ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను లమాహి ఆస్పత్రికి తరలించారు.

11 రోజుల తర్వాత మాజీ మోడల్ దివ్య మృతదేహం లభ్యం

చండీగఢ్: మాజీ మోడల్ దివ్యా పాహుజా హత్య జరిగిన 11 రోజులకు ఓ కాలువలో ఆమె మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ నెల 2వ తేదీన గురుగ్రామ్‌లోని హోటల్‌లో ఆమెను కొందరు కాల్చి చంపారు. ఆమె మృతదేహాన్ని అక్కడి నుంచి తరలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు... హోటల్ యజమాని అభిజిత్ సింగ్‌తో పాటు ఇద్దరు సిబ్బందిని అరెస్టు చేశారు. నాటి నుంచి ఆమె మృతదేహం కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. 11 రోజుల తర్వాత హరియాణాలోని ఓ కాలువలో గుర్తించారు. హత్య జరిగిన తర్వాత దివ్య శవాన్ని నిందితులు పంజాబ్‌లోని భాఖ్డా కెనాల్‌లో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. అది హరియాణాకు కొట్టుకొచ్చినట్లు తెలిపారు. తొహానా జిల్లాలో ఓ కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తన అభ్యంతరకర ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నందువల్లే దివ్యను చంపానని నిందితుడు అభిజిత్ విచారణలో చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఐదుగురు వ్యక్తులు ఆమెను హోటల్‌కు తీసుకెళ్లి తుపాకీతో కాల్పులు జరిపినట్లు గుర్తించారు. హరియాణా గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీతో దివ్యకు సంబంధాలున్నాయని పోలీసులు వెల్లడించారు. 2016లో ముంబైలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో సందీప్ మరణించాడు. అయితే అది నకిలీ ఎన్‌కౌంటర్ అని, సందీప్‌నకు ప్రత్యర్థి అయిన బిందర్ గుజ్జర్ అనే గ్యాంగ్‌స్టర్ హరియాణా పోలీసులతో కుమ్మక్కై చేయించినట్లు తేలింది. ఈ కేసులో ఆమె ఏడేళ్లు జైలు శిక్ష అనుభవించింది.

ముర్ముకు అయోధ్య ఆహ్వానం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందింది. ఈనెల 22న జరగబోయే కార్యక్రమానికి రావాలంటూ రాష్ట్రపతిని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సాదరంగా ఆహ్వానించింది. వీహెచ్‌పీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేత రామ్ లాల్ ఈ ఆహ్వాన పత్రికను ముర్ముకు అందజేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ 'ఎక్స్'తో పంచుకున్నారు. తనకు ఆహ్వానం అందడంపై ముర్ము ఎంతో సంతోషించారని, తన పర్యటనపై త్వరలోనే నిర్ణయిస్తానని చెప్పారని వినోద్ పేర్కొన్నారు.

గోదుమలు, బియ్యం, చక్కెర ఎగుమతిపై నిషేధాజ్ఞలు యథాతథం: గోయల్

న్యూఢిల్లీ: గోదుమలు, బియ్యం, చక్కెర ఎగుమతులపై నిషేధాజ్ఞలలో ఎలాంటి మార్పు లేదని, వాటిని ఎత్తివేయాలన్న ఆలోచనగానీ ప్రతిపాదనగానీ లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. విదేశాల నుంచి గోదుమలు, పంచదార దిగుమతి చేసుకోబోమని చెప్పారు. దేశీయ మార్కెట్లో ధరలను అదుపు చేయడానికి గతేడాది అక్టోబరు నుంచి చక్కర ఎగుమతులపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. 2023, జూలై నుంచి బాస్మతియేతర బియ్యం ఎగుమతులను కేంద్రం నిషేధించింది. 2022 మే నుంచి గోదుమల ఎగుమతులను నిలిపివేసింది.

జమ్మూకశ్మీర్‌లో ఆపరేషన్ సర్వశక్తి

ఉగ్రవాదానికి చెక్ పెట్టడమే లక్ష్యం: సైన్యం

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి చెక్ పెట్టేందుకు జమ్మూకశ్మీర్‌లో ఆపరేషన్ సర్వశక్తిని భారత సైన్యం చేపట్టబోతోంది. కేంద్ర పాలిత ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని, వాటిని తిప్పికొట్టేందుకు ఈ ఆపరేషన్‌ను చేపడుతున్నట్లు సైన్యం తెలిపింది. పీర్ పంజల్ పర్వత శ్రేణుల ఇరువైపుల ఉగ్రవాదుల ఏరివేతపైనే భద్రతా దళాలు దృష్టి పెడతాయని పేర్కొంది. శ్రీనగర్‌కు చెందిన చీనార్ కార్ప్స్‌తో పాటు నాగ్రోట–వైట్ నైట్ కార్ప్స్ ఏకకాలంలో కార్యకలాపాలను పీర్ పంజల్ పర్వతాల్లో చేపడతాయని ఆర్మీ వర్గాలు తెలిపాయి. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచేందుకు పాకిస్థాన్ చేపట్టే కార్యకలాపాలపై జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఇంటెలిజెన్స్ సంస్థలు నిఘా పెంచుతాయని, ముఖ్యంగా రాజౌరీ పూంచ్ సెక్టార్‌పై దేగకన్ను ఉంటుందని తెలిపాయి. 2023లో చేపట్టిన ఆపరేషన్ సర్ప్‌వినాశ్ తరహాలోనే ఈ ఆపరేషన్ జరగబోతోందని వెల్లడించాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.